1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

హైదరాబాద్

గురువారం | ఏప్రిల్ 04, 2024 | www.navatelangana.com

50 వేల మైలురాయి దాటిన ఇపియాన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

మోకాలితో పాటు కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్స లేకుండా చికిత్సల అందిస్తు న్న ఇపియాన్ పెయిన్ క్లినిక్ 50వేల మందికి విజయవంతంగా చికిత్సలు అందించినట్టు ప్రకటించింది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సుధీర్, వైద్యురాలు మీనన్‌తో కలిసి మాట్లాడారు. వివిధ కారణాలతో మోకాలి సమస్యలతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్స లేని వైద్యం అందించాలని లక్ష్యంతో 2013 నుంచి 2016 వరకు ప్రయత్నాలు చేసి మెరుగైన వైద్య విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. పిఆర్పి విధానంతో రోగి నుంచి సేకరించిన రక్త కణాల తోనే మెరుగైన చికిత్సలు అందించగలుగుతున్నట్లు చెప్పారు. 50,000 మంది రోగులకు మెరుగైన వైద్యం అందించడం గర్వంగా ఉందని అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాదిలో దేశవ్యాప్తంగా మరో 20 సెంటలను ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్నామని చెప్పారు.



హైదరాబాద్ నగర కమిషనర్ రోనాల్డ్ రోస్ ఐఏఎస్, నగర కలెక్టర్ అరవింద్ దురిశెట్టిలు బంజారా హిల్స్ బంజారా భవన్‌లో సర్కిల్ 17-18లో డిప్యూటీ కమీషనర్లు, ప్రశాంతి, జగన్‌లతో పాటు వారి పరిధిలో పని చేస్తున్న బిల్ కలెక్టర్లు కృష్ణ, బద్రి, టాక్స్ కలెక్టర్లు విశాల్, బాల నారెందర్లకు ఉత్తమ్ టాక్స్ కలెక్షన్ అధికారులుగా గుర్తించి సర్టిఫికెట్లను అందజేశారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్



అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో ముందుకు సాగాలి



- నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.భీమా

నవతెలంగాణ-హిమాయత్ నగర్

అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.భీమా సూచించారు. బీసీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం నిజాం కళాశాలలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమర వీరుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.భీమా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ బి.భీమా మాట్లాడుతూ అమరవీరుల త్యాగ ఫలితమే నేటి ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి స్వాతంత్ర పోరాటం వరకు జరిగిన అనేక ఉద్యమాల్లో ఎంతో మంది తమ ఆత్మబలిదానం చేశారని వివరించారు. ఉన్నత ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశం, సమాజ హితం కోసం విద్యార్థులు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి, బీసీ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, డిప్యూటీ రిజిస్ట్రార్ గీత, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రేణుక, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.పరంధాములు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే..

- బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ

నవతెలంగాణ-ముషీరాబాద్



ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల్సిన బాధ్యత పూర్తిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలవే అని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై విద్యానగర్ బీసీ భవన్‌లో విద్యార్థి సంఘాల నాయకుల సమావేశాన్ని నిర్వ హించారు. ఈసందర్భంగా వేముల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క కళాశాలకు పరిమిషన్‌తో వందల బ్రాంచీలు ఏర్పాటుచేసి ప్రయివేట్ విద్యా సంస్థలు తల్లిదండ్రుల వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల చేతిలో కీలుబొమ్మలుగా ప్రభుత్వాలు మారాయన్నారు. ప్రభుత్వ పాఠశాలను, కళాశాలను కాపాడాల్సిన బాధ్యత పూర్తిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలవే.. ప్రభుత్వ విద్యాసంస్థలు చదివిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేకమైన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్లను ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలని డిమాండ్ చేశారు. గురుకులాలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితరులకు ఆన్లైన్ దరఖాస్తు తీసుకుంటున్నప్పుడు ఇంటర్ అడ్మిషన్లు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక అంతర్యం ఏమిటో తెలపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు విద్యా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాతావరణం వేడెక్కుతోంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ రీజినల్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్ రెడ్డి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



హైదరాబాద్ జంట నగరాల్లో రోజు, రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతు న్నాయని దీంతో వాతావరణం వేడెక్కుతుందని కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ రీజినల్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. మనోజ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. వడగాలులు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని, వేడి తిమ్మిర్లు వస్తాయని, దీంతో నీరసం వస్తుందని, శక్తి తగ్గడం, కళ్ళు తిరగడం, తలనొప్పి, వాంతులు రావడం జరుగుతుందని హెచ్చరించారు. వడగాలుల నుంచి ఎలా రక్షించుకో వాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే వాటిపై వివరించారు. ఎక్కువగా నీరు, మజ్జిగా అధికంగా తీసుకోవాలని, రోజు సాధ్యమైనంత నీరు తాగడమే కాకుండా చల్లటి మజ్జిగ తీసుకోవడం ఉత్తమమని, వేళకు ఆహారం, పళ్ళ రసాలు వంటివి తీసుకుంటే ఎండల నుంచి కాస్త ఉపశమనం పొందవచ్చునని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆయన ప్రజలకు సూచించారు.

జర్నలిస్టు బైరిశెట్టి రవీందర్ రావు మృతి

- టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

నవతెలంగాణ-అంబర్‌పేట



హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచయూజే) మాజీ జాయింట్ సెక్రటరీ, అంబర్ పేటకు చెందిన సీనియర్ జర్నలిస్టు బైరిశెట్టి రవీందర్ రావు కొద్ది సేపటి క్రితం కన్ను మూశారు. ఉదయం పత్రిక నుంచి పలు పత్రికల్లో విలేకరిగా పని చేసిన రవీందర్ రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం కొంత మెరుగుపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా బుధవారం ఉదయం గుండెపోటు వచ్చి మృతి చెందారు. ఆయనకు భార్య, కొడుకు కూతురు ఉన్నారు. ఆయన నివాసం అంబర్ పేట బాపూనగర్‌లోని ప్రగతి స్కూల్ ఎదురుగా ఉన్న విజయ టవర్స్ రవీందర్ రావు మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సంతాపం తెలియజేసింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య భౌతిక కాయానికి నివాలర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలీనేని రామ్మోహన్ రావు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- విద్యార్థుల సంఖ్య కనుగుణంగా బస్సుల సంఖ్య పెంచి ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలి
- నగరంలో డ్రగ్స్ నిషేధించి, విద్యార్థులు వాటి బారిన పడకుండా చూడాలి
- ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా 42వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు





నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థుల పెండింగ్ స్కాలర్షిప్స్, రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని విద్యార్థుల సంఖ్య కనుగుణంగా బస్ సంఖ్య పెంచి ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిల్లా ఎస్ఎఫ్ఐ 42వ మహాసభలు బాగ్‌లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభల ప్రారంభం సందర్భంగా "స్వాతంత్ర్యం, ప్రజా స్వామ్యం, సోషలిజం" జెండాను ఎస్ఎఫ్ఐ హైదరా బాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లడుతూ గత 9 నెలలుగా ప్రభుత్వం డైట్ బిల్లులు ఇవ్వడం లేదనీ, డైట్ బిల్లులు ఇవ్వకుండా సంక్షేమ వసతి గృహాలను ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. బిల్లుల మంజూరు కేవలం తెల్ల పేపర్లలో చూసుకోవడానికే కనిపిస్తున్నాయని, సంక్షేమ వసతి గృహాల అధికారుల అకౌంట్లలో డబ్బులు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా డైట్ బిల్లులు సకాలంలో ఇవ్వని కారణంగా సంక్షేమ వసతి గృహాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికా హార భోజనం అందించడానికి వసతి గృహాల అధి కారుల దగ్గర డబ్బులు లేని కారణంగా రెగ్యు లర్ మెను ఇంప్లిమెంట్ చేయడానికి ఆటంకాలు ఏర్పడుతున్నా యనీ, పౌష్టిక విలువలు లేని ఆహారం కారణంగా విద్యార్థుల ఆరోగ్యం కుంటు పడుతుందన్నారు. ఆర్థిక సంవత్సరం పూర్తి కావ స్తున్నా బిల్లులు చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిదర్శనం మన్నారు. 7 వేల కోట్లకు పైగా స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలున్నాయనీ, విద్యా సంవత్సరం పూర్తి కావస్తోంద నీ ఇప్పటికే ట్యూషన్ ఫీజులు చెల్లించని కారణంగా ప్రయివేట్ యాజమా న్యాలు విద్యార్థులను తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాయ న్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రంగా స్పందిస్తామ ని హెచ్చరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రభుత్వమే వేసవి సెలవుల్లో ఎంసెట్ , నీట్ కోచింగ్ ఇవ్వాలని, ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు మెడిసిన్, బీడీఎస్, అగ్రికల్చర్ బీఎస్సీ వంటి కోర్సులు చదవలేకపోతున్నారనీ కార్పొరేట్ ప్రమాణాలతో ప్రయివేట్‌కు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచి తంగా కోచింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారం గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు, స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో విద్యార్థుల సంఖ్య అనుగుణంగా బస్ సర్వీసులు పెం చి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. నగరంలో డ్రగ్స్ నిషేందించి, విద్యార్థులు డ్రగ్స్ భారీన పడకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జరిగి న ప్రతినిధుల సభలో జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి కార్యకల పాల, నిర్మాణ నివేదిక ప్రవేశపెట్టారు. ఈ మహాసభలకు అధ్యక్ష వర్గంగా జిల్లా అధ్యక్షుడు లెనిన్, జిల్లా ఉపాధ్యక్షు రాలు రమ్య చౌహాన్, జిల్లా కమిటీ సభ్యురాలు జువేరియా వ్యవరించారు. ఈ మహాసభకు సహా ర్ధంగా డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం. డి జావిద్ పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, అశోక్ ఉపాధ్య క్షులు శ్రీమాన్, నాగేందర్ ,వీరేందర్, సునీల్ సహాయ కార్యదర్శి ప్రశాంత్, స్టాలిన్, రమ్య, చరణ్ శ్రీ, స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

'సే నో టూ ప్లాస్టిక్ సేవ్ ఎర్త్' నినాదాన్ని బలపర్చండి

- నటుడు సుమన్ తల్వార్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్లాస్టిక్‌ను నివారించి ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సినీనటుడు సుమన్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320ఏ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్‌ను నివారిద్దాం-భూమిని కాపాడుకుందామనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడడం సర్వసాధారణమై పోయిందని, ఫలితంగా క్యాన్సర్ లాంటి జబ్బులు వస్తున్నాయన్నారు. నగరంలో గ్రీనరీ సైతం తగ్గిపోయిందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. తాను జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ లాంటి ప్రాంతాల్లో షూటింగ్లు చేస్తున్నప్పుడు పక్కన భవనాల నుంచి ట్యాంక్లు నీటితో నిండి వృథాగా నీరు పోతుండడాన్ని గమనించానని, అలా చేయడం వల్ల నీటి కొరత ఏర్పడుతుందన్నారు. నీటి వృథా చేసే వారిపై చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక టీమ్ను ఏర్పాటుచేయాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోకుంటే బెంగళూరు లాంటి పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అనంతరం ప్లాస్టిక్‌ను నివారిద్దాం- భూమిని కాపాడుకుందా అనే నినాదంతో కూడిన స్టిక్కర్లను లయన్స్ క్లబ్ అధ్యక్షులు కామిని శ్రీనివాసులు, ఓజోన్ హాస్పిటల్ ఎండి దీప్తి, డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు.

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌కు 'అఛీవ్‌మెంట్ అవార్డ్ ఫర్ కన్‌స్ట్రక్షన్ ఎడ్యుకేషన్' అవార్డు

నవతెలంగాణ-సిటీబ్యూరో



నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌కు 'అఛీవ్ మెంట్ అవార్డ్ ఫర్ కన్‌స్ట్రక్షన్ ఎడ్యుకేషన్' అవార్డు సొంతం చేసుకుంది. 15వ (సీఐడీసీ) విశ్వకర్మ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా 'న్యాక్' సంస్థ 'అఛీవ్‌మెంట్ అవార్డ్ ఫర్ కన్‌స్ట్రక్షన్ ఎడ్యుకేషన్' కు ఎంపిక చేశారు. ఈ అవార్డును డైరెక్టర్ ఏం. రాజి రెడ్డి, డైరెక్టర్ శాంతి శ్రీ అందుకున్నారు. బుధవారం న్యూఢిల్లీలో ఇండియా హాబిటాట్ సెంటర్, స్టెయిన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు. నిర్మాణ పరిశ్రమ అభివృద్ధి మండలి (సీఐడీసీ) భారత ప్రభుత్వం ప్రణాళికా సంఘం, నీతి ఆయోగ్ సంయుక్తంగా ఆమోదించిన సంఘం. 2023-24లో 27,532 మందికి నిర్మాణ సంబంధిత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి నందుకు 'న్యాక్' ఈ అవార్డును అందుకుంది. స్కిల్ డెవలప్‌మెంట్, స్కిల్ అప్‌గ్రేడేషన్ ప్రోగ్రామ్‌ల శిక్షణ తీసుకున్న చాలా మంది విద్యార్థులు నిర్మాణ పరిశ్రమలో విజయవం తంగా రాణిస్తున్నారు. అంతేకాకుండా 2023-24లో 2,546 మంది సివిల్ ఇంజి నీరింగ్ గ్రాడ్యుయేట్‌ల కోసం ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రామ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లు, ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లే కాకుండా మేనేజ్‌మెంట్ డెవలప్ మెంట్ వంటి ప్రోగ్రామ్‌లను నిర్వహించి వారికి లాభదాయక ఉపాధిని కల్పించింది. 'న్యాక్' చేసి న మంచి పనిని గుర్తించి నిర్మాణరంగ విద్యా' విభాగంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేయడం గర్వించదగ్గ విషయం అని 'టీఆర్ అండ్ బీ' ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, న్యాక్ డైరెక్టర్ జనరల్, డైరెక్టర్లు, ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు.

పరిశోధనా ఫలాలు సగటుమనిషికి ఉపయోగపడాలి

- ఉస్మానియా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య రవీందర్


నవతెలంగాణ-ధూల్‌పేట్



వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనా ఫలాలు సగటు మనిషికి ప్రయోజనాన్ని చేకూర్చాలని ఉస్మానియా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.రవీందర్ అన్నారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సంస్థ సౌజన్యంతో ప్రభుత్వ సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్సేస్ ఇన్ ఎనర్జీ మెటీరియల్స్ అండ్ డివైజెస్' అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సమా వేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సామాజిక తత్వానికి వైజ్ఞానిక శాస్త్రాల పరిశోధనలకు మధ్య అంతర్గత సంబంధం ఉండాలని సూచించారు. సరికొత్త ఆలోచనలతో, వినూత్న పరిశోధన ఆసక్తితో ముందుకువచ్చే విద్యార్థులకు విశ్వ విద్యాలయం పక్షాన ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. అత్యధిక మార్కుల సాధన కోసం కాకుండా నైపుణ్యాలను సముపార్జిం చు కోవడంపైనే విద్యార్థు లు ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించాలన్నారు. డిగ్రీలో సైన్స్ చదువు కున్న విద్యార్థులు తమ కిష్టమైన మరొక కోర్సులో పీజీ చేసే అవకాశం కేవలం ఉస్మానియా విద్యాలయంలో మాత్రమే ఉందని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రయోజనవంత మైన జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడంలో సిటీ కళాశాల అగ్రభాగాన నిలిచిందని కితాబు ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్.బాల భాస్కర్‌ను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిం చారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం సైన్స్ విభాగం డీన్ ఆచార్య డి.కరుణా సాగర్ మాట్లాడుతూ.. పర్యావ రణహితమైన వైజ్ఞానిక ఆవిష్కరలను, శక్తి సంబంధమైన సాధ నాలను కొత్తగా రూపొందించుకోవాల్సిన అవసరముందన్నారు. ఆత్మీయ ఏ.ఆర్.సి.ఐ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్.పి.కె. జైన్ మాట్లాడుతూ.. బహుళ ప్రయోజనదాయకమైన వైజ్ఞానిక సాధనా లను, శక్తి సంబంధమైన పరికరాలను తయారు చేసుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజం ఎదుర్కొనే సవాళ్ళను అధిగమించటానికి అవసరమైన పరిశోధనలపై శాస్త్రవేత్తలు, ఆచార్యులు దృష్టి పెట్టాలని తెలిపారు. ఐఐసిటి సంస్థ శాస్త్రవేత్త ఆచార్య ఎం. వసుంధర, ఉస్మానియా విశ్వ విద్యాలయం భౌతికశాస్త్ర విభాగం అధ్యక్షులు ఆచార్య ఎం. శ్రీనివాస్‌లు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. భౌతిక శాస్త్ర విభాగం అధ్యక్షులు డాక్టర్. నైన వినోదిని, సదస్సు సహాయ సమన్వయ కర్త డాక్టర్.వాసుదేవరెడ్డి, డాక్టర్. చిన్ని కృష్ణ, డాక్టర్. లక్ష్మీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.విప్లవ దత్ శుక్ల, డా. యాదయ్య, డాక్టర్.రత్నప్రభాకర్ పాల్గొన్నారు. ప్రచురించిన ప్రత్యేక సంచికను వైస్ ఛాన్సలర్ ఆచార్య రవీందర్ ఆవిష్కరించారు. రెండు రోజుల జాతీయ సదస్సులో వివిధ విశ్వ విద్యాలయాల, కళాశాలల ఆచార్యులు పత్ర సమర్పణ చేస్తారు. వివిధ దేశాల నుండి అనేక మంది శాస్త్రవేత్తలు అంతర్జాలం ద్వారా ప్రసంగిస్తారు.

ఫిరాయింపులకు గేట్లు తెరవడం కాదు ప్రాజెక్టులకు గేట్లు తెరవాలి

- భారత జాతీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఫిరాయింపులకు గేట్లు తెరవడం కాదని, ప్రాజెక్టులకు గేట్లు తెరచి రాష్ట్రంలో ఎండిపోతున్న పంట పొలాలకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని భారత జాతీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు డిమాండ్ చేశారు.గడచిన 120 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఉచిత పథకాలకు ఆశపడిన ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి తెలంగాణలో ఎండిపో యిన పొలాలు, కరెంట్ కోతలు, రైతుల ఆత్మహత్యలు తప్ప ఏమి కనిపించడం లేదని విమర్శించారు.కాంగ్రెస్, బీజేపీ నాయకులు గత బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనపై నిందలు వేస్తూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఇకనైనా విమర్శలు, ప్రతి విమర్శలు మానుకుని పాలనపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్



ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని భారతీయ పౌరునిగా ఈ ఆయుధాన్ని వినియోగించుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని బంజారా హిల్స్ పోలీసులు ఏసీ వెంకటరెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్‌ను బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంజారా హిల్స్ ఎన్బిటి నగర్ శ్రీరామ్ నగర్‌లో పర్యటించి ఓటర్లను అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ప్రతి ఒక్కరు శాంతి యుతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సామాజిక తెలంగాణ సాధనకు బీసీలు సిద్ధం కావాలి

- ట్యాంక్ బండ్ పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నూటికి 90 శాతం జనాభా ఉన్న బహుజన కులాల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రమని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో వేల మంది బడుగు బలహీన వర్గాలు బలిదానం చేస్తే సాధించిన తెలంగాణ పిడికెడు శాతం లేని అగ్రకులాలకు వేలుబడిగా మారిందని, దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సామాజిక తెలంగాణ సాధన లక్ష్యంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, తొలి అమరవీరులు దొడ్డి కొమురయ్య 97వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరులు దొడ్డి కొమురయ్యకే దక్కిందన్నారు. కొమురయ్య ఆశయ సాధన కోసం బడుగు బలహీన వర్గాలు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. బలిదానాలు బడుగులు చేస్తే ముఖ్యమంత్రి పీఠాలు పరిపాలన పగ్గాలు మాత్రం పిడికెడు శాతం లేని అగ్రకులాలకు దక్కాయన్నారు. వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని దొరలు, పటేళ్లు పంచుకుని పరిపాలిస్తున్నారని విమర్శించారు.దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజ్యాధికారాన్ని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బహుజన మహనీయులైన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న, ప్రొఫెసర్ జయశంకర్, మారోజు వీరన్న, కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ మహనీయులపై ప్రభుత్వాలు వివక్షత చూపిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్ చారి, గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ-ఏ కులాల అధ్యక్షులు, ప్రొఫెసర్ బాగయ్య, ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ జన సేన రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూదాని సదానందం, కార్యదర్శి జాజుల లింగం, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్, నాయకులు గణం నరసింహ, పానుగంటి విజయ్, సిద్ధాంతం శ్యామల, దేవిక, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన అంతర్ కళాశాలల టెన్నోఫెస్ట్ యాంత్రిక్-2.4

- అంతర్ కళాశాలల టెన్నోఫెస్ట్ యాంత్రిక్-2.4ను ప్రారంభించిన కే.సి. శర్మ

నవతెలంగాణ-అంబర్‌పేట



అంతర్ కళాశాలల టెన్నోఫెస్ట్ యాంత్రిక్-2.4ను బుధవారం వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను అండర్ గ్రౌండ్ మాగ్నెటిక్ షింగ్ స్టేటర్ ప్రతినిధి కె.సి. శర్మ లాంచనంగా ప్రారంభించారు. ఈ టెన్నోఫెస్ట్ నగరంలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని అవగాహన పొందారు. ఈ ఫెస్ట్ క్విజ్-బజ్, క్యాడ్, క్లాష్, పోస్టర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్-ఎక్స్ పో వంటి నాన్-టెక్నికల్ ఈవెంట్లు వంటి వివిధ సాంకేతిక ఈవెంట్లకు నాంది పలికినట్లయింది. టెక్నోఫెస్ట్ ఎలక్ట్రికల్ వాహనాలు, 3-డీ ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీలపై వర్క్ షాప్ ద్వారా మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు అద్భుతమైన అభ్యాస అవకాశాలను అందించారు. ఈ సందర్భంగా వర్ధమాన్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందికి విభాగాధిపతి డాక్టర్ పి.వెంకటేశ్వరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

జాబ్ మేళాకు అనూహ్య స్పందన



నవతెలంగాణ-ఓయూ

ఆంధ్ర మహిళా సభ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కళాశాల యాజమాన్యం వారి ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన జాబ్ మేళాకు అనుహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్, స్టేట్ బోర్డ్ పాఠశాలలైన అరవింద ఇంటర్నేషనల్ స్కూల్, కీస్ హై స్కూల్, సాలిడే తెలంగాణ స్కూల్, హార్వర్డ్ స్కూల్ , ఓబుల్ రెడ్డి స్కూల్, తక్షశిల హై స్కూల్ వంటి పలు ప్రముఖ పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ జాబ్ మేళాలో 100కు పైగా అభ్యర్థులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

మైలారం కీర్తికి ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం సైన్సు కళాశాల బోటని విభాగంలో ప్రో.ఎ. సబితా రాణి పర్యవేక్షణలో 'ఇన్విట్రో కల్చర్ అండ్ పైటో కెమికల్ ప్రొఫైలింగ్ ఆఫ్ ఓపర్క్యులిన టార్పెతం (ఎల్) సిల్వ మాన్ సో అనే అంశంపై మైలారం కీర్తి తన పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో ఓయూ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ మేరకు ఓయూ పరీక్షల విభాగం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. డా.కీర్తి ప్రస్తుతం కామారెడ్డి లో గల తెలంగాణ స్టేట్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళశాలలో బోటని లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. తన పరిశోధన విజయవంతంగా పూర్తి చేయడానికి గైడ్ ప్రో.ఎ. సబిత రాణి, తన తల్లిదండ్రులైన ఎం.పరశురాం, అనురాధ, భర్త డా.గుంతేటి. సుధాకర్ రావుల తోడ్పాటు తోనే పీహెచ్డీ పూర్తి చేసినట్టు డా.కీర్తి చెప్పారు. ఈ సందర్భంగా ఆమెను విభాగం ప్రొపెసర్స్, సహా పీహెచ్డీ విద్యార్థులు, కుటుంబ సభ్యులు అభినంధిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.



కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తాం

- ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున మాదిగ

నవతెలంగాణ-ఓయూ

మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో సీతాఫల్మండి చౌరస్తా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం దగ్గర బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి, డప్పు మల్లికార్జున మాదిగ మాట్లాడుతూ మాదిగల ప్రోత్బలంతోనే రాజకీయంగా ఎదిగానని ప్రగల్బాలు పలికిన రేవంత్ రెడ్డి.. నీకు అండగా ఉన్న మాదిగ జాతిని అణిచివేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. పార్లమెంట్ స్థానాల కేటాయింపులో కాంగ్రెస్ మాదిగలకు, బీసీలకు తీరని ద్రోహం చేసిందన్నారు. 17 పార్లమెంట్ స్థానాల్లో 5 శాతం లేని రెడ్లకు 6, 12 శాతం పైగా ఉన్న మాదిగలకు సున్నా సీట్లు కేటాయించారన్నారు. రేవంత్ రెడ్డి మాలలకు భయపడి తన ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడం కోసం వారి మాట వింటూ మాదిగలకు అన్యాయం చేస్తున్నాడన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ తుమ్మల శివప్రసాద్ మాదిగ, తార్నాక డివిజన్ కన్వీనర్ మహేందర్ మాదిగ,కొప్పుల సాయి మాదిగ, దేవేందర్ మాదిగ,డి. మహేష్ మాదిగ, మధు వీరభద్ర,రాజారపు ప్రవీణ్ మాదిగ, శ్యామ్ మాదిగ,నితీష్ ,వంశీ మాదిగ, అరుణ్ కుమార్ మాదిగ పాల్గొన్నారు.

మైనంపల్లికి శ్రీ గణేష్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-కంటోన్మెంట్



కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా మైనంపల్లి హనుమంతరావు. నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిని కంటోన్మెంట్ కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హనుమంతరావు నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి, పుష్పగుచం అందించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ మైనాంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్త సంజీవ రెడ్డి, బద్దం బలవంత్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘనంగా టెక్నాలజీ కళాశాల స్పోర్ట్స్ డే

నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ వార్షిక క్రీడా కార్యక్రమాన్ని బుధవారం టెక్నాలజీ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆసియా క్రీడల కాంస్య పతక విజేత నందిని అగసర, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపాల్ ప్రొ. వి. సత్యనారాయణ పాల్గొన్నారు. టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సాయిలు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ డా.డి అర్జున్ 2024 సంవత్సరానికి సంబంధించిన క్రీడా దినోత్సవం నివేదిక వివరించారు. అలాగే కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ఈవెంట్స్ గురించి వివరించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఆటల ప్రాముఖ్యత, ఫిజికల్ ఫిట్‌నెస్ గురించి విద్యార్థులకు వివరించారు. ప్రొ. సాయిలు, ఆటల పోటీలు, వాటి ప్రాముఖ్యత నిజ జీవితం లో ఎంత అవసరమో వివరించారు. అనంతరం వివిధ క్రీడలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందేశారు.చాంపియన్‌గా బి ఆకాష్, మున్ని నిలిచారు. ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్, కన్వీనర్ డాక్టర్ డి. అర్జున్ ధన్యవాదాలతో కార్యక్రమాన్ని ముగించారు.అధ్యాపక బందం ప్రొ. బసవరావు ప్రొ.హయవదన, ప్రొ.శ్రీను నాయక్,ప్రొ.రాజ్యం, దా. జాస్పల్ సింగ్ ,దా.విజయ కాంత్,దా,ధీరజ్,దా,రేణు, షకీరా, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓయూలో ఘనంగా ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-ఓయూ

ఓయూలోని నాన్ టీచింగ్ పంక్షన్ హాల్‌లో ఎన్‌జీఓఎస్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు బియాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఓయూ ఉద్యోగులకు ఇఫ్తార్ విందును ఘనంగా ఇచ్చారు. ముఖ్య అతిథులుగా ప్రొ. కోదండరాం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రో.ఆర్.లింబాద్రి, కార్యదర్శి ప్రో.శ్రీరాం వెంకటేష్, ఓయూ వీసీ ప్రొ. రవీందర్ , ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీ నారాయణ, టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, డా.కొండ నాగేశ్వర్ ,ప్రో.ప్యాట్రిక్‌లు అతిథులుగా పాల్గొన్నారు. ఓయూ విద్యార్థి నాయకులు సలీమ్ పాష, మాసంపల్లి అరుణ్ కుమార్, అక్బర్ బేగ్, సిద్దకి బేగ్, నాగరాజ రావు, శివ శంకర్, జలీల్, ఎక్బల్ , మెహతాబ్, కాజా మొహినుద్దీన్ , సిద్దిక్ బేగ్, జహం గీర్, హుస్సేన్ ఖాన్, గౌస్‌లు హాజరయ్యారు. ఓయూలోని మూడు ఉద్యోగ సంఘాల నాయకులు, ముస్లిం ఉద్యోగులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి'

నవతెలంగాణ-ఓయూ



మాదిగలకు, బీసీలకు తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీని కడియం శ్రీహరిని చిత్తుచిత్తుగా ఓడించాలని, సీఎం రేవంత్ రెడ్డికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. తార్నాక లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడియం శ్రీహరి 40 సంవత్సరాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలుగుదేశం, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల్లో మంత్రిగా , ఉప ముఖ్యమంత్రిగా, ఎంపీగా , ఎమ్మెల్యేగా మాదిగలకు రావలసిన అన్ని పదవులు అనుభవించారని తెలిపారు. అలాగే 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని దూషించి ఆ పార్టీకి ఒక్కసారి కూడా ఓటు వేయని కడియం శ్రీహరి, పార్టీలో సభ్యత్వం లేని అతని కూతురు కావ్య తిరిగి మాదిగల అవకాశాలను కొల్లగొట్టడానికి కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముస్లింను కావ్య పెండ్లి చేసుకొని వరంగల్ మాదిగల అవకాశాలను దెబ్బ కొట్టడానికి కాంగ్రెస్ నుంచి వరంగల్ ఎంపీగా గెలవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మాదిగలకు ఒక్క సీటు కేటాయించని కాంగ్రెస్‌కు , సీఎం రేవంత్ రెడ్డికి తగిన రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కర్నాటక మాల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర కాంగ్రెస్ మాల నాయకులు అందుకు బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా ఇంటర్ కాలేజ్ కల్చరల్ పోటీలు





ఓయూలో అలరించిన విద్యార్థుల నృత్యాలు

నవతెలంగాణ-ఓయూ

విద్యార్థులు క్రీడల్లో సాంస్కృతిక కార్యక్రమాలల్లో పాల్గొన్నాలని ఓయూ వీసీ ప్రో.రవీందర్, రిజిస్ట్రార్ ప్రో.పి.లక్ష్మీ నారాయణలు సూచించారు. ఓయూ



ఠాగూర్ ఆడిటోరియంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆఫీస్ ఆఫ్ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ వారి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఓయూ ఇంటర్ కాలేజేట్ కల్చరల్ కాంపిటీషన్స్ 2023 - 24 పోటీలను బుధవారం వీసీ, రిజిస్ట్రార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వేదికలపై సత్తా చాటుకుని భవిష్యత్తులో ఇంకా రాణించాలని సూచించారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్, కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ బి. రాజేందర్ నాయక్ మాట్లాడుతూ ఓయూ క్యాంపస్, అఫ్లియేషన్ కళాశాలలకు సంబంధించిన యూజీ, పీజీ అభ్యసిస్తున్న 1158 మంది విద్యార్థిని, విద్యార్థులు, 168 కళాశాలాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు.

అలరించిన నత్యాలు.. ఉల్లాసంగా ఉత్సహంగా పాల్గొన్న విద్యార్థులు.

ఇంటర్ కాలేజ్ కల్చరల్ పోటీల్లో భాగంగా విద్యార్థులు వివిధ రకాల డ్యాన్స్ (నత్యాలు) చేస్తూ అలరించారు. క్లాసికల్ డాన్స్, గ్రూప్ ఫోక్ డాన్స్, గ్రూప్ ట్రైబల్ డాన్స్, గ్రూప్ ప్యాట్రియాటిక్, గ్రూప్ వేస్ట్రన్ పోటీలు ఓయూ ఠాగూర్, ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ ఆడిటోరియం లో వేరు వేరుగా నిర్వహించారు. పాటల పోటీల్లో భాగంగా గ్రూప్ సాంగ్స్ ఇండియన్, గ్రూప్ సాంగ్స్ వెస్టన్ గ్రూప్ సాంగ్స్ ఫోక్‌లలో పోటీలు పెట్టారు. అలాగే ఏకపాత్రాభినయం, ఉపన్యాస పోటీలు, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ప్రో.రెడ్యా నాయక్, ఇంజినీరింగ్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రో.అర్జున్ రావు, ప్రో.చంద్రశేఖర్ , సీనియర్ ప్రొఫెసర్ మాజీ హెడ్ ప్రొఫెసర్ డి సూర్య ధనుంజయ్,హిస్టరీ విభాగం హెడ్ ప్రో.లావణ్య యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రొఫెసర్ కె కష్ణ చైతన్య యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ మరియు హెడ్ ప్రొఫెసర్ ఎం. మాధవి,ఆఫీస్ ఉద్యోగులు సూరజ్, మధు, ప్రేమ్ కుమార్ అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిల్మ్ ఛాంబర్‌లోని హెూటల్‌లో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ - బంజారాహిల్స్

ఫిల్మ్ ఛాంబర్‌లోని ఓ హెూటల్లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. ఫిల్మ్ ఛాంబర్‌లోని స్వరుచి హెూటల్లోని వెనుక భాగంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవిం చలేదని అధికారి చంద్రశేఖర్ బాబు తెలిపారు.

బార్‌లో అశ్లీల నృత్యాలు

- బార్ ఓనర్‌తో పాటు ముగ్గురు మేనేజర్ల అరెస్టు
- 33 మంది యువతులతో పాటు మరో 74 మందిపై కేసు

నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట్‌లోని ఊర్వశి బార్‌లో అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు చేయిస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు 33 మంది అమ్మాయిల, మరో 74 మంది యువకులపై కేసు నమోదుచేసిన పోలీసులు బార్ ఓనర్ శ్రీనివాస్‌తోపాటు ముగ్గురు మేనేజర్లను అరెస్టు చేశారు. బేగంపేట, టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్‌లోని ఊర్వశీ బార్ అండ్ రెస్టారెంట్‌లో అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు చేయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బేగంపేట పోలీసులతో కలిసి బార్‌పై బుధవారం అర్ధరాత్రి దాడులు చేశారు. ఈ దాడుల్లో అశ్లీల నృత్యాలు చేస్తున్న 33మంది అమ్మాయిలతో పాటుమరో 74 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు బార్‌లో పనిచేస్తున్న ముగ్గురు మేనేజర్లను అరెస్టు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. కాగా సెక్షన్ 297 కింద కేసు నమోదుచేసి 33 మంది అమ్మాయిలను బేగంపేట మహిళ పోలీసులకు అప్పగించామని వెల్లడించారు.

పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ అన్నారు. జూబ్లీహిల్స్ కార్యాలయంలో ఎమ్మెల్యే టి.పద్మ రావుతో బుధవారం బీఆర్‌ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ పద్మారావు గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుదామని, ప్రతీ ఒక్క కార్యకర్త పట్టుదలతో పనిచేయాలని నాయకులను, కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో యూసఫ్ గూడా కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదీప్య రావు, సంజీవ్, జావేద్, ఖదీర్ బాయ్, విజయ్ కుమార్, నరసింహారెడ్డి, అరుణ్‌కుమార్, డివిజన్ స్థాయి అధ్యక్షులు, బూత్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్‌ను బొంద పెడతాం

- ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ



నవతెలంగాణ-ఓయూ

మాదిగ కులానికి పార్లమెంట్ సీట్లలో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో రేవంత్ రెడ్డి, మల్లికార్జున్ ఖర్గేల దిష్టిబొమ్మను ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగలు మాట్లాడుతూ... మాదిగ జాతికి కాంగ్రెస్ తెలంగాణలో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మల్లికార్జున ఖర్గేలు మాదిగ జాతి ద్రోహులన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో రాజకీయ సమాధి కడతామని, అందుకోసం మాదిగలమంతా ఏకమై కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ, నరసయ్య మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారపు శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి చెడుపల్లి రఘువరన్ మాదిగ, ఇన్‌చార్జి నలిమెల వంశీరాజు మాదిగ, బైకాడి ప్రవీణ్, వీరపాకుల హరి మాదిగ,నందు , వంగూరి ప్రభాకర్, నవీన్,నర్సింగ్,అంజన్, పాల్గొన్నారు.

విద్యార్థి దారుణ హత్య



తరుణ్ (ఫైల్ ఫోటో)

నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేటలోని బలంరాయి వద్ద ఇరువర్గాలు కొట్టుకోగా ఓ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బేగంపేట్ పీఎస్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి సమయంలో బాలం రాయ్ అంబేద్కర్ నగర్ వద్ద ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కత్తి తో విద్యార్థి తరుణ్ పై దుండగులు దాడికి పాల్పడడంతో అతను తీవ్రగాయాలపాలయ్యాడు. అతన్ని 108 అంబులెన్స్ లో ఆస్పత్రిలో తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.ఘటన స్థలికి చేరుకున్న బేగంపేట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నలుగురు వ్యక్తులు తరుణ్ పై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డట్టు పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.



కంటోన్మెంట్‌లో మాదిగలకు టిక్కెటివ్వాలి

నవతెలంగాణ-కంటోన్మెంట్

మాదిగలకు న్యాయం జరిగే వరకు సంఘటితంగా ఉద్యమించాలని కంటోన్మెంట్ మాదిగల బలగం ప్రతినిధులు పిలుపునిచ్చారు. డాక్టర్ వంశతిలక్, శ్రీ కిషన్ మాదిగ, గోపి ఆధ్వర్యంలో బుధవారం బోయిన్ పల్లిలోని బాపూజీ నగర్ లో ఓ హెూటల్‌లో మాదిగల సింహగర్జనకు నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మాదిగలకు టికెట్లు కేటాయించకపోతే 200 మంది కి పైగా నామినేషన్లు వేసి తమ సత్తా చూపుతామన్నారు. అందుపల్ల మాదిగల జనాభాను దృష్టిలో ఉంచుకుని టికెట్లు కేటాయించాలన్నారు.కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన మాదిగల బలగం ప్రతినిధులు అజిత్ కళ్యాణ్, ఉత్తరయ్య, శంకర్, ఆనంద్, శ్రీకాంత్ , రాజేందర్ , విజయ రామరాజు, రాజేశ్, రాజు,జోడి బ్రదర్స్, మహేశ్, కొమ్ముల మధు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పనిగంటలు మార్చాలి

- జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికుల పనిగంటల్లో మార్పు చేయాలని మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు జే.వెంకటేష్(జేవీ) తెలిపారు. జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో, హైదరాబాద్‌లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నాయని జీహెచ్ఎంసీ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులకు పని గంటలల్లో (ఏప్రిల్, మే, జూన్ మాసాలల్లో) మార్పులు చేయాలని కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయని తెలిపారు. గత కొన్నేండ్ల నుంచి జీహెచ్ఎంసీలో వేసవి కాలంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల పనివేళల్లో మార్పులు చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా ఏప్రిల్, మే, జూన్ మాసాలల్లో ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పని గంటలను మార్పు చేయాలన్నారు. ఎండ తీవ్రత బారిన కార్మికులు పడకుండా చూడాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రావణ్ కుమార్, సీ.మల్లేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.శ్రీనివాస్, రంగారెడ్డి జల్లా జీహెచ్ఎంసీ అధ్యక్షులు ఏ.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ నేర్చుకునే వారికి అడ్డంకులను డీఈటీ తగ్గిస్తుంది

- అత్యధికంగా డీఈటీ పరీక్ష రాసే నగరంగా హైదరాబాద్
- డీఈటీ మార్కెట్ లీడ్ (ఇండియా) తారా కపూర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఇంగ్లీష్ లెర్నర్స్‌కు ఉన్నత విద్యలో ఉన్న అడ్డంకులను 'డ్యుయోలింగో ఇంగ్లిష్ టెస్ట్' తగ్గిస్తుందని డ్యుయోలింగో ఇంగ్లిష్ టెస్ట్ మార్కెట్ లీడ్ (ఇండియా) తారా కపూర్ తెలిపారు. బంజారాహిల్స్‌లో ఓ హెూటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డ్యుయోలింగో ఇంగ్లిష్ టెస్ట్ మార్కెట్ లీడ్ డైనమిక్ ల్యాండ్‌స్కేప్, డైరెక్టర్లు ఎమ్మా మేక్లివ్ వాడీర్, లురా కుబ్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. భారతదేశంలో అత్యధికంగా డుయోలింగో ఇంగ్లీష్ టెస్ట్ (డీఈటీ) పరీక్ష రాసే నగరంగా హైదరాబాద్ నిలిచిందన్నారు. ఉన్నత విద్య డైనమిక్ ల్యాండ్‌స్కేప్‌లో ప్రావీణ్యత పరీక్ష తప్పనిసరన్నారు. డీఈటీ ఈ విషయంలో ముందంజలో ఉందన్నారు. ఇది ఆంగ్ల భాషను మూల్యాంకనం చేయడంలో ముందుందని చెప్పారు. అడ్వాన్స్‌డ్ అసెస్‌మెంట్ సైన్స్, హ్యూమన్ ఇన్ ది లూప్ ఏఐ మార్గదర్శకత్వంలో విద్యార్థుల ఉన్నత విద్యావకాశాల సాధనే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. డీఈటీకి భారతదేశం అతిపెద్ద మార్కెట్‌గా ఉందన్నారు. వ్యాపారం, కంప్యూటర్ సైన్స్, గణితం, ఇంజినీరింగ్ వంటి రంగాలలో గ్రాడ్యుయేట్ డిగ్రీలను అభ్యసించాలనుకున్న అత్యధిక సంఖ్యలో టెస్ట్-టేకర్లతో భారతదేశం డీఈటీకి అతిపెద్ద మార్కెట్‌గా ఉందని తెలిపారు. భారతీయ విద్యార్థులు 2023లో 83 దేశాలలో ప్రోగ్రామ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు.గత సంవత్సరంతో పోలిస్తే ఇది తొమ్మిది శాతం పెరిగిందని అంతర్జాతీయ విద్యా అవకాశాల కోసం ముఖ్యంగా యునైటెడ్ స్టేట్స్ ఉచ్చారణ డిమాండ్‌ను ప్రతిబింబిస్తూ డీఈటీ పరీక్ష రాసేవారి కోసం హైదరాబాద్ అగ్రశ్రేణి నగరంగా ఉద్భవించిందన్నారు. డీఈటీ పరీక్ష రాసే మొదటి 25 నగరాల్లో ఏడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వరంగల్, నెల్లూరు,ఖమ్మం ఈ జాబితాలో ఉన్నాయని చెప్పారు.

కిషన్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి

- ఇన్సూరెన్స్‌తోపాటు మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి
- తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు జే.వెంకటేష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ప్రధానకార్యాలయంలో ఎంటమాలజీ విభాగంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పెండ్యాల కిషన్ ఆకస్మిక మతి బాధాకరమని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు జే.వెంకటేష్(జేవీ) అన్నారు. మృతుని కుటుంబానికి బీమా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కిషన్ కుటుం బానికి ఇన్సూరెన్స్ చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ... కిషన్ గత కొన్నేండ్లుగా బాధ్య తలను పట్టుదలగా నిర్వర్తిస్తున్నాడని గుర్తు చేశారు. గురు వారం అకస్మాత్తుగా ఫిట్స్ రావడం, సకాలంలో వైద్యం అందించలేకపోవడంతో కిషన్ ప్రాణాలు కోల్పోయాడన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ఉన్నప్పటికీ తగిన డాక్టర్లు, సిబ్బందిని నియమించి, వైద్య సేవలు సమర్ధవంతంగా నిర్వహించి ఉంటే కిషన్ తన నిండు ప్రాణాన్ని కోల్పోయేవాడు కాదన్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో 'ప్రైమరీ హెల్త్ సెంటర్'ని బలోపేతం చేసి వైద్య సేవలు మెరుగు చేయాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, సీ.మల్లేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.శ్రీనివాస్, రంగారెడ్డి జల్లా జీహెచ్ఎంసీ అధ్యక్షులు ఏ.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త వర్టికల్ ట్రీట్ మెంట్ ప్లాంట్ల నిర్మాణం

- స్థలాన్ని పరిశీలించిన ఎండీ సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో



గండిపేట్, కోకాపేట్, పుప్పాలగూడ తదితర ప్రాంతాల్లో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా నూతనంగా అత్యాధునిక వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాంతాల్లోని ప్రజలకు నీటి ఊరట కలిగించేలా ఈ చర్యలు చేపట్టనుంది. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్ల నుంచి అదనంగా సరఫరా చేసే నీటిని శుద్ధి చేయడానికి గండిపేట్ కాండూట్ మీద ఈ వర్టికల్ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్లను నిర్మిస్తారు. బుధవారం గండిపేట్ కాండూట్ మీద గండిపేట్, కోకాపేట్, పుప్పాలగూడ ప్రాంతాల్లో 3 ఎమ్ఎల్డీల సామర్థ్యం కలిగిన 3 అత్యాధునిక వర్టికల్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మించడానికి అనువైన స్థలాన్ని ఎండీ సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ఓఆర్ఆర్ పరిధిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్లే జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ ఏర్పడిందన్నారు. గండపేట్, కోకాపేట్, పుప్పాలగూడ సమీప ప్రాంతాల్లో అదనంగా 9 ఎంఎల్డీల మంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంకర్లను రోజూ 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. హైదరాబాద్ మహా నగరంలో తాగునీటి సరఫరాకు కొరత లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం నగరానికి నాగార్జున సాగర్, ఎల్లంపల్లి, మంజీరా, సింగూరు నుంచి నీరు సరఫరా జరుగుతోందని తెలిపారు. నాగార్జున సాగర్‌లో 136.47 టీఎంసీల నీరు ఉందని, 131.66 టీఎంసీల వరకు డెడ్ స్టోరేజీ ఉన్నా 4.81 టీఎంసీల నీరు వాడుకోవచ్చన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 4 నెలలకు గానూ 5.60 టీఎంసీల నీరు అవరం అవుతుందన్నారు. ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో 7.71 టీఎంసీల నీరుందని, 3.31 టీఎంసీల వరకు డెడ్ స్టోరేజీ ఉన్నా 4.40 టీఎంసీల నీరు వాడుకోవచ్చొన్నారు. అంతకాకుండా జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుంచి కూడా నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఎమర్జెన్సీ పంపింగ్‌కు ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. సాగర్ నుంచి ఈ నెల 15 నుంచి, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మే 1 నుంచి ఎమర్జెన్సీ పంపింగ్ చేస్తామన్నారు. సుంకిశాల ప్రాజెక్టు నిర్మాణం ప్రస్తుతం వేగంగా జరుగుతోందన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ఈ ఏడాది డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని అభిప్రాయపడ్డారు.

సరఫరా చేస్తున్న నీరు (ఎంఎల్డీలలో)

- ఉస్మాన్ సాగర్ : 91.00
- హిమాయత్ సాగర్ : 12.32
- సింగూరు, మంజీరా : 460.00
- కృష్ణా ఫేజ్- 1, 2, 3 : 1254.33
- గోదావరి ఫేజ్-1: 741.45

మొత్తం: 2559.00

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై పుస్తకం ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాజకీయ విశ్లేషకులు పాల్వాయి రాఘవేంద్ర రెడ్డి రచించిన 'రెసోనెన్స్ ఆఫ్ డెమెక్రసీ, ఈ బుక్ ఆఫ్ తెలంగాణ అసెంబ్లీ ఎలక్షన్స్ 2023' అనే పుస్తకాన్ని కాంగ్రెస్ నేత వైఎస్ షర్మిల ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను, విశ్లేషణాత్మక ధోరణితో మరిన్ని రచనలు రావాలన్నారు. నగరానికి చెందిన రాజకీయ విశ్లేషకులు పాల్వాయి రాఘవేందర్ రెడ్డి, కిందటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై ఈ పస్తకాన్ని రచించినట్టు తెలిపారు. రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు నెలకొన్న ఒక విశిష్టమైన అనిశ్చితి, పార్టీల ముందు ఉన్న ప్రత్యేకమైన సవాళ్లు చూసాక తనకు ఈ పుస్తకం రాయాలన్న ఆలోచన వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా అందరినీ విశేషంగా ఆకర్షించిన 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం, ఎన్నికలను ప్రభావితం చేసిన కొన్ని ప్రత్యేక పరిస్థితులు, కొందరు రాజకీయ నేతలు, వీటన్నిటినీ సమగ్రంగా అందజేసే ప్రయత్నం ఈ పుస్తకంలో కనపడుతుందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సంతోష్‌నగర్

నిరుపేదలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమ్యూనిటీ కోఆర్డినేటర్ పర్వతాలు అన్నారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సింగరేణి కాలనీలో రైయిన్‌బో ఆస్పత్రి, ఆశ్రిత కమ్యూనిటీ బెస్ట్ కేర్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని డాక్టర్ గంగాధర్ వైద్య బృందం, సీడీపీవో జ్యోత్స్న, ఎస్సై మమత హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో పదిమంది డాక్టర్స్ 400 మందికి ఫ్రీ చెకప్ మందులు ఫ్రీగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభావాణి, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సుభాష్ బాబు, డాక్టర్ ఈశ్వర్ కుమార్, డాక్టర్ అబ్దుల్ గఫార్, డాక్టర్ రాజేష్, డాక్టర్ యాదగిరి, డాక్టర్ శివప్రసాద్, ఆశ్రిత సిబ్బంది, మాధవీ రెడ్డి, ప్రజ్వల, ఝాన్సీ, సరిత, హేమలత, సుధాకర్, సంధ్యారాణి, యశోద, అధికారులు రోగులు తదితరులు పాల్గొన్నారు.

మినరల్ కాదు జనరల్..

- శుద్ధ జలం పేరుతో నార్మల్ వాటర్ విక్రయం
- బీఐఎస్ ప్రమాణాలకు విరుద్ధంగా ప్లాంట్ల ఏర్పాటు
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వైనం
- తనిఖీలు చేపట్టని అధికారులు





పేరుకు మినరల్ వాటర్ కానీ అందులో మినరల్స్ ఉండవు. పోనీ.. ధర ఏమైనా తక్కువ ఉన్నదా.. అంటే అదీ లేదు. మినరల్ వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటు ఇష్టారాజ్యం గా జరుగుతోంది. వేసవి రాగానే ఇదో వ్యాపారంగా మారిపోతుంది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో మినరల్ వాటర్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. కేవలం వ్యాపార ధృక్పథంతోనే తక్కువ ఖర్చుతో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండానే వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్‌లో ప్రతీ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా వందల సంఖ్యలో (ఆర్‌వో ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ ప్లాంట్) శుద్ధ జల కేంద్రాలు పుట్టుకొస్తున్నాయి. ప్రజలకు మినరల్ వాటర్ పేరుతో సాధారణ వాటర్ అమ్ముతూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలు మినరల్ వాటర్ అనుకొని ఈ నీటిని తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. అనుమతి పొందిన ప్లాంట్లు పదుల సంఖ్యలో ఉంటే అనధికార ప్లాంట్లు వందల సంఖ్యలో ఉన్నాయి. గతంలో అనుమతులు పొందిన వారు గడవు అయిపోయిన తర్వాత కూడా రెన్యువల్ చేసుకోకుండా అలాగే నడిపిస్తున్నారు. ఈ తతంగం అంతా అధికారులకు తెలువకుండా జరుగుతుందా? నిర్వాహకుల వద్ద ముడుపులు తీసుకుని అధికారులు సహకరిస్తున్నారని చాలాకాలంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే అధికారులు వాటర్ ప్లాంట్లు తనిఖీలు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అడిగేవారు లేకపోవడంతో వాటర్ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది. కనీసం వాటర్ క్యాన్లను సరైన పద్ధతిలో క్లీన్ చేయకపోగా పాడైన ఫంగస్ పట్టిన క్యాన్లలో వాటర్ నింపి ఆటోల ద్వారా ప్రజలకు సరఫరా చేసి డబ్బులు దండుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవాలని స్థానికులు కోరుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పాంట్లను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్లాంటు ఏర్పాటుకు నిబంధనలు ..

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చిన్న పరిశ్రమల శాఖతో పాటు అయిదు శాఖల అనుమతులు తప్పనిసరి. ఐఎస్ఐ మార్క్ కోసం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ అనుమతి పొందాలంటే దాదాపుగా లక్ష రూపాయల రుసుం చెల్లించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్లల్లో ఎయిర్ కండిషనర్‌తో పాటు కెమికల్ ల్యాబ్ మైక్రో బయోలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది, బీఐఎస్ ప్లాంట్ అంతా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఉండాలి. ఇవే కాకుండా అధికారులు ప్రతీ మూడు నెలలకోసారి ఆయా ప్లాంట్లలో నీటి నమూనాలను సేకరించి పలు రకాల పరీక్షలు నిర్వహించాలి. అన్నీ సక్రమంగా ఉంటేనే లైసెన్స్‌లు ఇస్తారు. ప్లాంట్ నిర్వహణతో పాటు ప్యాకెట్లు, బాటిళ్లకు కూడా ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అధికారుల కార్యాలయాలకు సైతం ప్యూరిఫైడ్ పేరుతో నీటిని సప్లయ్ చేస్తున్న నీటిని తాగుతున్నారే తప్పా అసలు ఈ వాటర్ ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేశారు. తమ శాఖ అనుమతులు ఇవ్వకుండానే ఏ విధంగా నీటిని సరఫరా చేస్తున్నారనే పట్టింపు లేకుండా అధికారులు తమ విధులను కొనసాగిస్తున్నారు.నాణ్యత ప్రమాణాలు పాటించని ప్లాంట్లపై ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్టేషన్ యాక్ట్ 1954 ప్రకారం కేసులు నమోదు చేయాలి. మూడు నెలలకోసారి ప్లాంట్లను తనిఖీ చేసి గుర్తింపులేని వాటిని రద్దుచేసేలా జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు ప్రభుత్వం ఎప్పుడో బాధ్యతలు అప్పగించింది. కానీ ఇప్పటికీ ఏ ఒక్క ఫుడ్ ఇన్‌స్పెక్టర్, అధికారులు ఎక్కడా ఈ ప్రమాణాలను పరిశీలించిన దాఖలాలు లేవు.

అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు

రంగులేని నీరు కాస్తంత తియ్యగా ఉంటేచాలుననే ఉద్దేశ్యంతో శుద్ధనీరు తయారీ కేంద్రాన్ని నడిపేంచేస్తున్నారు. నిబంధనల మేరకు నీటిని శుభ్రం చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. బాటిల్ నీటిని కొన్న రెండు రోజుల్లోనే అందులో చిన్నచిన్న క్రిములు తయారవుతు న్నాయి. ఈ నీటిని తాగడం ద్వారా అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి వాటర్ తాగి అనారోగ్యం పాలైన వారు ఇప్పుడు సొంతగా ఇంట్లోనే వాటర్‌ప్యూరీఫైడ్‌ను పెట్టుకుని, కాచి చల్లార్చిన నీటిని తాగడమో చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం



మినరల్ వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు అనుమతి తప్పని సరి గా తీసుకోవాలి. ఐఎస్ఐ మార్క్ కచ్చితంగా ఉండాలి. ఇటీవలే వాటర్ ప్లాంట్ల విషయం మా దృష్టికి వచ్చింది. త్వరలోనే అనుమతి లేకుండా నడిపిస్తున్న వాటర్ ప్లాంట్లను తనిఖీలు నిర్వహిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని సీజ్ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

-జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య జయంతి



నవతెలంగాణ-కాప్రా


తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుడు దొడ్డి కొమరయ్య జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఉద్యమ నేత సీహెచ్ నాగేశ్వరరావు, ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు జె.చంద్రశేఖర్ దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ సామాజిక ఉద్యమ నేత కోమటి రవి మాట్లాడుతూ.. నిజాం సర్కారుకు తొత్తులుగా ఉన్న దొరలకు వ్యతిరేకంగా దొడ్డి కొమరయ్య పోరాటం చేసి వీరమరణం పొందారని తెలిపారు. ఆయన మరణంతో ప్రజలు చైతన్యమై రైతాంగ సాయుధ పోరాటం సాగించారని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, జరిగిన పోరాటంలో దొరల ప్రయివేట్ సైన్యం కాల్పుల్లో దొడ్డి కొమరయ్య వీరమరణం పొందారని చెప్పారు. కానీ నేటి పాలకులు ఆనాటి చరిత్రను వక్రీకరించి రజాకర్ లాంటి చిత్రాలను తీస్తూ తెలంగాణ చరిత్రను హిందూ, ముస్లింల పోరాటంలాగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ఇటువంటి నీచమైన పద్ధతులు అవలంభించిన పాలకులను ఎండగట్టాలని, నిజమైన పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకురావాలని కోరారు. ఆనాడు హిందూ, ముస్లింలు అందరూ కలిసి దొరలకు, నిజాం సర్కారుకు వ్యతిరేకంగా గొప్ప పోరాటం చేశారన్నారని గుర్తు చేశారు. అనంతరం జయప్రకాష్, శ్రీమన్నారాయణ, సీహెచ్. నాగేశ్వరావు, శారద, శివన్నారాయణ, పీబీ.చారి ప్రసంగించారు. అనంతరం సభికులందరూ దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలను వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, కోమటి రవి, సంతోష్, లక్ష్మయ్య, బాలు, శారద, వెంకన్న, వెంకట్, సీహెచ్. నాగేశ్వరరావు, గౌస్య, శోభ, శ్రీమన్నారాయణ, శివన్నారాయణ, జయప్రకాష్ పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్యకు నివాళులర్పించిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



తెలంగాణ ఉద్యమ కారుడు దొడ్డి కొమర య్య జయంతి సందర్భంగా ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మల్లాపూర్ డివిజన్‌లోని దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఎల్లారెడ్డిగూడలో ఇండ్ల మధ్యలో నెమళ్లు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ ఎల్లారెడ్డి గూడ మల్లారెడ్డి గార్డెన్ సమీపంలోని మల్లికార్జున నగర్‌కు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలోని చెట్ల పొదల్లో 10 నుంచి దాదాపు 20 వరకు నెమళ్లు ఆవాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నాయి. ఇటీవల చెట్ల పొదలను నరికి వేయడంతో ఆవాసం కోల్పోయిన నెమళ్లు ఇండ్ల మధ్యన తిరుగుతుండడంతో కుక్కలు వెంబడిస్తున్నాయి. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్, వన్యప్రాణి విభాగం, అటవీ శాఖ అధికారులు నెమళ్లకు సంరక్షణ చర్యలు చేపట్టాలని మల్లికార్జున నగర్ కాలనీవాసులు కోరుతున్నారు.

కూచిపూడి, భరతనాట్యంపై కల్చరల్ పరీక్షలు



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడలోని శ్రీమహా ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో సురభారతి కళా కేంద్రం కలకత్తా యూనివర్సిటీ అనుబంధ సంస్థ చినుకు కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం, వెస్ట్రన్ డాన్స్, కీబోర్డ్ మొదలగు వాటికి కల్చరల్ ఎగ్జామ్స్ నిర్వహించారు. ఈ పరీక్షలకు ఎగ్జామినర్‌గా ఢిల్లీ నుంచి ప్రముఖ నాట్యకారిణి జానకిదేవి హాజరయ్యారు. ముఖ్యతిథులుగా హాజరైన యోగా గురువు అశోక్ కుమార్ పాండే జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జామ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన తనదైన రీతిలో పిల్లలకు మనో ధైర్యాన్ని ఇచ్చారు. చినుకు కల్చరర్ సొసైటీ ప్రిన్సిపాల్ అనుదీప్తి ఆధ్వర్యంలో పరీక్షలు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగాయి. ఈసీఐఎల్, ఏఎస్‌రావునగర్, నాచారం, చింతల్ నుంచి గురువులు ఇందూమతి, రజిత, లలిత, లక్ష్మీదేవి, శ్రీదేవి, వారి శిష్యులు 200 మంది పాల్గొన్నారు. పరీక్ష అనంతరం జానకిదేవి మాట్లాడుతూ.. పిల్లల్లో ఎంతో ప్రతిభ ఉంటుందని, దాన్ని వెలికి తీయడానికి పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. చినుకు కల్చరల్ సొసైటీ అధ్యక్షులు పీఎస్.మూర్తి పిల్లలను పరీక్షలు తీసుకొచ్చిన వారి గురువులను, తల్లిదండ్రులను అభినందించారు. శ్రీమహా ఇన్‌స్టిట్యూట్ కూచిపూడి గురువు కుమారిసాయి మహల్య ఆధ్వర్యంలో మొదటిసారిగా 15 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. ఎగ్జామ్స్ సెంటర్‌కు ఈ అవకాశం కల్పించిన పీఎస్.మూర్తికి శ్రీ మహా ఇన్‌స్టిట్యూట్ అధినేత లావణ్య కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి రూ.5 వేలు ఆర్థిక సాయం



నవతెలంగాణ-కీసర

కీసర గ్రామంలోని నిరుపేద విద్యార్థి గోరంటి లవ్య ఉన్నత చదువుల కోసం కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. పేదరికం చదువుకు అడ్డు కాకూడదని చదువుకునే విద్యార్థులకు తమ వంతుగా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కీసర గ్రామ శాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా షర్మిల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా నిత్యావసర సరుకులు, బట్టలు పంపిణీ చేశారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుక్కమ్మ బస్తీలో కుల మతాలకు అతీతంగా దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ రషీద్ ద్రావిడ నిత్యావసర వస్తువులను, బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ..తన సంపాదనలో సగ భాగం, పేదల కోసం ఖర్చు పెట్టాలనే సంకల్పంతో షర్మిల చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఏడాది నిరుపేద విద్యార్థులకు, అనాథ పిల్లలకు పుస్తకాలు, వృద్ధులకు తమ ట్రస్టు ద్వారా అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు తమ పండుగలను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని టి.కాలేషా అన్నారు. షర్మిల చారిటబుల్ ట్రస్టుకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీ. వహీద్‌తో పాటు షర్మిల, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ చింతల రాజశేఖర్‌ను కలిసిన ఈటల



నవతెలంగాణ-ఘట్‌కేసర్

బీజేపీ మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి ఈటల రాజేందర్ బుధవారం పోచారం మున్సిపాలిటీ మూడో వార్డు కౌన్సిలర్ చింతల రాజశేఖర్ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరాలని ఆహ్వానించారు. మోడీ నాయకత్వాన్ని బలపర్చాడానికి తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, పోచారం మున్సిపల్ అధ్యక్షులు ననావత్ సురేష్ నాయక్, పోచారం మున్సిపల్ ఒకటో వార్డు కౌన్సిలర్ గొంగళ్ల మహేష్, రాష్ట్ర కౌన్సిలింగ్ మెంబర్ అచ్చిని నరసింహ, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, జిల్లా, మండలాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సుధాకర్ మరణం తీరని లోటు : ఏసురత్నం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కామ్రేడ్ సుధాకర్ మరణం కార్మిక లోకానికి తీరని లోటని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర కార్యదర్శి ఏసురత్నం అన్నారు. అల్వాల్ ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక నాయకుడు కామ్రేడ్ సుధాకర్ దశ దినకర్మ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ.. సుధాకర్ కార్మిక సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్మిక సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశారని కొనియాడారు. ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరువ లేనివన్నారు. నివాళులర్పించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఉజ్జిని హరినాథరావు, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, మున్సిపల్ నాయకులు మహేందర్, నర్సింగ్, రాజు, శీను, సీపీఐ అల్వాల్ మండల కార్యదర్శి సహదేవ్ తదితరులున్నారు.

అవినీతి డబ్బు రూ.17 లక్షల 49 వేలు రికవరీ

- మిగిలిన రూ.8 లక్షల 56 వేలకు లెక్కలు చూపిన మేడ్చల్ మున్సిపల్ అధికారులు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ కార్యాలయంలో గత నెల నిర్వహించిన ఆడిటింగ్‌లో రూ.26 లక్షల 50 వేల నిధులు గోల్ మాల్ అయిన విషయం తెలిసిందే. మార్చి నెలలో ఆర్థిక సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా ఆడిటింగ్ అధికారి వెంకటేశంలో ఆడిటింగ్ నిర్వహించారు. ఈ ఆడిటింగ్‌లో మేడ్చల్ మున్సిపాలిటీలో నిధుల గోల్‌మాల్ అనే శీర్షికతో నవ తెలంగాణలో ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు దుర్వినియోగమైన డబ్బును రికవరీ చేశారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన మున్సిపల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో విధులు నిర్వహించే ఓ మహిళా ఉద్యోగినిపై కమిషనర్ స్థానిక మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా కేసు నమోదైన కొద్ది రోజుల వ్యవధిలోని రూ. 17లక్షల 49 వేల 308 రికవరీ అయ్యాయని, మిగిలిన రూ.8లక్షల 56 వేల 63 లకు ఆడిట్‌లో లెక్కలు చూపారని కమిషనర్ నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను సీడీఎంఏ అధికారులకు అందజేస్తామని వెల్లడించారు. కాగా గోల్‌మాల్ జరిగిన రూ.17లక్షల పైచిలుకు డబ్బులు ఎవరు కట్టారని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని వివరణ కోరగా నిధులు దుర్వినియోగం చేసిన వ్యక్తులే తిరిగి డబ్బులు కట్టారని తెలిపారు. అవినీతికి పాల్పడిన సదరు ఉద్యోగులపై శాఖకు పరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం : కార్పొరేటర్ సతీష్ కుమార్



నవతెలంగాణ-జవహర్‌నగర్

డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని 12వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ అన్నారు. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ వాసులు 12వ డివిజన్‌లో నీటి సమస్య, సీసీ రోడ్డుకి స్పీడ్ బ్రేకర్స్ లేకపోవడంతో ప్రమాదాలు అవుతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ సమస్యలను మేయర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు.

మేయర్ శాంతి కోటేష్ గౌడ్‌కు సన్మానం

నూతనంగా ఎన్నికైన జవహర్‌నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్‌ను కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ కాలనీ ప్రజలతో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 12వ డివిజన్‌లో మంచినీరు, డ్రయినేజీ పైప్‌లైన్ సమస్యలను మేయర్ శాంతి కోటేశ్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను త్వరంలో పరిష్కరిస్తామని మేయర్, కమిషనర్‌లు తెలిపినట్టు కార్పొరేటర్ సతీష్ కుమార్ తెలిపారు.

385 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు

- ఆర్డర్లు తీసుకుని పేపర్ వ్యాల్యూయేషన్‌కు హాజరు కాకపోవడంతో ఈ నిర్ణయం
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేపర్ వ్యాల్యూయేషన్‌కు హాజరు కాని టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. బాలానగర్‌లోని ఎస్‌ఎస్‌కేకే పాఠశాలలో పదో తరగతి పేపర్ మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభమైనట్టు తెలిపారు. ఈ మూల్యాంకనానికి టీచర్ల రిపోర్టింగ్ తక్కువ శాతం నమోదు కావడంతో, ఆర్డర్లు తీసుకుని రిపోర్టింగ్ చేయని టీచర్లకు షోకాజ్ నోటీలు ఇచ్చినట్టు తెలిపారు. నోటీసులు అందుకున్న టీచర్లు నేడు ఉదయం 9 గంటలకు తప్పని సరిగా రిపోర్టు చేయాలనీ, లేదంటే వారిపై సీసీఏ రూల్స్ ప్రకారం తగు కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 385 మందికి షోకాజ్ నోటీలు ఇచ్చినట్టు తెలిపారు.

ఘనంగా దొడ్డి కొమరయ్య జయంతి

- నివాళులర్పించిన నాయకులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వగ్గు చంద్రశేఖర్‌రావు కురుమ అన్నారు. బుధవారం ఆ సంఘం మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షులు జోగు వెంకటేష్ కురుమ, ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య కురుమ ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో దొడ్డి కొమరయ్య 97వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు దొడ్డి కొమరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కురుమ సంఘం నాయకులు మాట్లాడుతూ..భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం రైతాంగ పోరాటంలో నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జంట నగరాల ఉపాధ్యక్షులు రాంమోహన్, మల్కాజిగిరి కమిటీ నాయకులు మురళీకృష్ణ, మల్లేష్, కుమారస్వామి, పరందాములు, ఆంజనేయులు, శ్రీనివాస్, వెంకటేష్, నగేష్, రవికుమార్, పర్వతాలు, నవీన్ కుమార్, రమేష్, సిద్ధులు, సత్యనారాయణ, బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు కామల్ల ఐలన్న, ఉపాధ్యక్షులు కరణం గోపి, రమేష్ గౌడ్, కోశాధికారి అప్పాల శ్రీనివాస్, బీసీ నాయకు లు నవీన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కిరణ్‌రజక, కాసర్ల నాగరాజు రజక, బాలరాజ్‌గౌడ్, నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

కీసరలో ..



నాగారం మున్సిపాలిటీలో దొడ్డి కొమురయ్య 97వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ జయంతి ఉత్సవాలలో నాగారం మున్సిపల్ ఛైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ ఛైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, కౌకుట్ల అనంత్ రెడ్డి , లావణ్య శ్రీనివాస్, సుమిత్ర సురేష్, నాగారం బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీధర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి, టీడీపీ అధ్యక్షులు జంగారెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు, చీర సురేష్ కురుమ, మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మహేందర్ తదితరులున్నారు.



స్థిరాస్తి పన్ను వసూలులో మార్చి 31 వరకు జీహెచ్ఎంసీ సర్కిల్ 19 అధికారులు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతోపాటు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు సంయుక్తంగా కలిసి చేసిన టాక్స్ వసూలు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి, సుమారు రూ. 35 కోట్లు సర్కిల్ 19లో వసూలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నగర కలెక్టర్ అరవింద్ దురిశెట్టి, నగర కమిషనర్ రొనాల్డ్ రోస్ ఐఏఎస్ అధికారుల చేతుల మీదుగా సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఏఎంసీ బాలరాజు, ఎఎంసీ కమల్, బిల్ కలెక్టర్ టాక్స్ కలెక్టర్లకు ఉత్తమ కలెక్షన్ ప్లేయర్ సర్టిఫికెట్లను అందజేశారు.
నవతెలంగాణ-జూబ్లీహిల్స్



అసెంబ్లీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో వెంకటగిరి పీజేఆర్ కమిటీ హాల్లో, అంగన్వాడీ ఆశ వర్కర్ సమస్యలపై కేంద్రం మంత్రి జి.కిషన్ రెడ్డి సతీమణి శ్రీమతి కావ్య కిషన్ రెడ్డి బుధవారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నపిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ కాంటెస్ట్ ఎమ్మెల్యే శ్రీలంకల దీపక్ రెడ్డి , పద్మా వీరపనేని, అనంతలక్ష్మి, బరిగల జ్ఞానేశ్వర్, బడుగు సతీష్, సుప్రియ గౌడ్ చంద్రమోహన్, నాగమణి రూప, కవిత, కుమారి పాల్గొన్నారు.
నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అక్రమంగా వేసిన బోర్లను తొలగించాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అక్రమంగా వేసిన బోర్లను వెంటనే తొలగించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కూకట్‌పల్లి నియోజక వర్గం పరిధిలోని అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లలో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో స్థానిక ప్రజల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే బుధవారం పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమంగా చెరువుల పరిధిల్లో బోర్లు వేస్తూ భూగర్భ జలాలను జలగల్లా పీల్చేస్తున్న వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాముని చెరువు కట్టను అనుకోని వెలసిన ఇండ్లలో ఇష్టారాజ్యంగా మూడు, నాలుగు బోర్లు వేసుకొని ట్యాంకర్లు, టాటా ఏసీ వాహనాల ద్వారా నీటిని విక్రయిస్తున్న వారి ఆగడాలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి అక్రమంగా వేసిన బోర్లను ఎమ్మెల్యేకు చూపించారు. ఎమ్మెల్యే రాకను గమనించిన అక్రమ నీటి విక్రయదారులు వారి ఇండ్లు, షటర్లకి తాళాలు వేసుకొని అక్కడినుంచి వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్, ఎమ్మార్వో, ఇరిగేషన్, పోలీసు అధికార్లకు ఫోన్ ద్వారా అక్రమంగా బోర్లు వేసి నీటిని విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ బోర్లను వెంటనే తొలగించాలని సూచిం చారు. కాముని చెరువు, సున్నం చెరువు పరిధిలోనీ అక్రమ బోర్లను తొలగించకపోతే స్థానికులతో కలిసి ధర్నా నిర్వహిస్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబేహా బేగం, గౌసుద్దీన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి



- మేడ్చల్-మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఈవీఎం, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని మేడ్చల్-మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ హరిప్రియతో కలసి ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామన్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఐదు నియోజకవర్గాల్లో గల 2,425 పోలింగ్ కేంద్రాలకుగాను ఆన్‌లైన్ ద్వారా ఈవీఎం యంత్రాలను కేటాయించినట్టు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో 591 పోలింగ్ కేంద్రాలకు 738 కంట్రోల్ యూనిట్లు, 738 బ్యాలెట్ యూనిట్లు, 827 వీవీ ప్యాట్‌లను కేటాయించగా, మల్కాజిగిరి నియోజక వర్గానికి 418 పోలింగ్ కేంద్రాలకుగాను 522 కంట్రోల్ యూనిట్‌లు, 522 బ్యాలెట్ యూనిట్లు, 585 వీవీ ప్యాట్‌లను, కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో 417 పోలింగ్ కేంద్రాలకుగాను 521 కంట్రోల్ యూనిట్లు, 521 బ్యాలెట్ యూనిట్లు, 583 వీవీ ప్యాట్‌లు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో 592 పోలింగ్ కేంద్రాలకుగాను 740 కంట్రోల్ యూనిట్లు, 740 బ్యాలెట్ యూనిట్లు, 828 వీవీ ప్యాట్‌లు, ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో 407 పోలింగ్ కేంద్రాలకు 508 కంట్రోల్ యూనిట్లు, 508 బ్యాలెట్ యూనిట్లు, 569 వీవీ ప్యాట్‌లు కేటాయించినట్టు తెలిపారు. జిల్లా మొత్తం 3,029 సీయూలు, 3,029 బీయూలు, 3,393 వీవీ ప్యాట్‌లు కేటాయించినట్టు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ర్యాండమైజేషన్ నిర్వహించి కేటాయించినట్టు తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్ హర్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం పేదలకు వరం

- ఆదర్శనగర్ హౌసింగ్, బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఏర్వ. శంకరయ్య



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు వారికి వరమని ఆదర్శనగర్ హౌసింగ్, బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, రంగారెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య అన్నారు. బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ముత్తూట్ ఫైనాన్స్ ఆరోగ్య సంచారిణి, ఎం.జార్జ్ ఫౌండేషన్ సంస్థ హైదరాబాద్ నేతృత్వంలో ఆదర్శనగర్ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో కిడ్నీ వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు, లివర్ సంబంధిత వ్యాధులు, బీపీ, షుగర్ పరీక్షలు చేయడంతో పాటు వాటి రిపోర్టులు కూడా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. వివిధ విభాగాలకు చెందిన అనుభవజ్ఞులైన వైద్య నిపుణులచే సుమారు 150 మంది వైద్య పరీక్షలు చేయించు కున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు నాంచారమ్మ, ఎం.దుర్గ, నాగభూషణం, ఆంజనేయులు, నాగదేశి రవి కుమార్, చంద్రశేఖర్ నారాయణ గౌడ్, కోటేశ్వరరావు, ఆర్టిసి జె.శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి ముత్తూట్ వైద్య సంచారిణి, ఎం.జార్జ్ ఫౌండేషన్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మల్కాజిగిరి అభ్యర్థిని గెలిపించుకుందాం..



- ఎమ్మెల్యే మధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలిపే లక్ష్యంగా బాలానగర్ డివిజన్‌లో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో... ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు రాగిడి లక్ష్మారెడ్డిని పరిచయం చేస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో బీఆర్ఎస్ ఎంపీని గెలిపించుకుందామన్నారు. నియోజకవర్గంలో వేలది కోట్లతో బీఆర్ఎస్ హయంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూకట్‌పల్లి నియోజకవర్గా న్ని గతంలో ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. దశాబ్దాల కల బాలానగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని అనతి కాలంలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వాకే దక్కిందని గుర్తు చేశారు. అంతేకా కుండా మురుగునీటి వ్యవస్థను శుద్ధి చేయడానికి ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణం చేపట్టామని చేసిన అభివృద్ధికి ఓట్లు వేసి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీ ఇవ్వాలని కృష్ణారావు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బాలానగర్ డివిజన్ అధ్యక్షులు దర్శనం శాకయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, సభా అధ్యక్షులు మందడి సుధాకర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ అనుబంధ కమిటీల నాయకులు, సభ్యులు, మహిళా విభాగం నాయకురాళ్లు, కాలనీ బస్తీల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు క్లీనిక్‌లు, ఒక ల్యాబ్ సీజ్



- అనుమతుల్లేకపోవడంతో మూసివేత
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి

నవతెలంగాణ-సిటీబ్యూరో

అనుమతుల్లేని రెండు క్లీనిక్‌లు, ఒక ల్యాబ్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ బృందం సీజ్ చేసింది. రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సిఫార్సుల ఆధారంగా అనర్హత డాక్టర్, నమోదు కాని షాపూర్‌నగర్‌లో ఉన్న ఆర్ఆర్ శ్రీజన్ క్లీనిక్, శ్రీ వీరభద్ర ఫస్ట్ ఎయిడ్ క్లీనిక్, పూర్ణ ల్యాబ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా క్లీనిక్‌లు, ల్యాబ్స్‌లలో వైద్య పరికరాలు, శస్త్రచికిత్స కత్తెరలు, ప్రొసీడ్యూరల్ మెటీరియల్స్, ఎపిడ్యూరల్ స్టెరాయిడ్ ఇంజెక్షన్‌లు, ఎక్స్పైరీ మందులు లభించడంతో మూసేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి. రఘునాథస్వామి మాట్లాడుతూ యాజమాన్యం అర్హత గల వైద్యులు, సిబ్బంది లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ హాస్పిటల్స్ నడపడం సరికాదన్నారు. ఇది ప్రజలకు నష్టం కలిగిస్తుందన్నారు. ఈ క్లినిక్‌లు చట్ట విరుద్ధంగా అర్హత గల వైద్యులతో నమోదు కాకుండా, చిన్న చిన్న శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనుమతి లేకుండా వైద్య నిపుణులుగా ప్రాక్టీస్ చేసి ప్రచారం చేసుకుంటున్నట్టు కూడా గమనించినట్టు తెలిపారు. జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన ఏ హాస్పిటల్‌పైన అయినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నవనీత, డెమో అంజయ్య, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ అంటేనే త్యాగానికి ప్రతీక



- కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రంజాన్ అంటేనే త్యాగానికి ప్రతీక అని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా బుధవారం వాజిద్ భాష ఆధ్వర్యంలో అల్లాపూర్ ఎస్‌డీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డితో కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రంజాన్ సందర్భంగా ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులు అత్యంత కఠిన నియమ నిబంధనలతో రంజాన్ జరుపుకోవడం అభినందనీయమన్నారు. నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షతో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేయడం రంజాన్ మాసం గొప్పదనం అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, సేరి సతీష్ రెడ్డి, రేష్మ, స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



హిందూ, ముస్లిం సోదరభావాలకు ప్రతీకగా ఇఫ్తార్ విందులు దోహద పడతాయని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ అన్నారు. బుధవారం సాయంత్రం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని బీరప్పనగర్‌లో స్థానిక ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయనతో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్‌లు మత పెద్దలు,ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవాబ్ పాషా, మొహమ్మద్ ఇబ్రహీం, జహంగీర్, మౌలానా, గౌసుద్దీన్, హనుమయ్య, మైలారం రాజు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్ర ప్రజలకు అండ గులాబీ జెండా



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండ గులాబీ జెండా అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. బుధవారం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల సమావేశంలో భాగంగా రంగారెడ్డినగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయనతోపాటు బీఆర్ఎస్ ఎం.పీ. అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, డివిజన్ కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తోడుగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీ ఉన్నట్లయితే రెట్టింపు వేగంతో అభివృద్ధి జరుగుతుందని వారు వ్యాఖ్యానించారు. జాతీయ పార్టీలు వారి ప్రయోజనాల కోసం పనిచేస్తాయె తప్పా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయవని విమర్శించారు. మన గొంతు వినిపించే మన పార్టీ నాయకులు పార్లమెంట్లో ఉంటే వచ్చే నిధులను కొట్లాడి సాధించుకోవచ్చునని తెలిపారు. అనంతరం ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్‌లో చెల్లని రూపాయి బీజేపీ అభ్యర్థి ఈటెల మల్కాజిగిరిలో ఎలా చెల్లుతుందని ఆరోపిస్తూ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా పనిచేసిన సునీత మహేందర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థికి అసలు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమస్యల పై అవగాహన ఏమి తెలుసు చెప్పాలని సవాల్ చేశారు. ఎన్నికల్లో మల్కాజ్గిరి ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి ఏనాడైనా కుత్బుల్లాపూర్‌కి వచ్చాడా.? ప్రజా సమస్యలు ఎప్పుడైనా తెలుసుకున్నారా.? అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ఎన్నికలప్పుడు ప్రజల్లో తిరిగే నాయకులను కాకుండా ఒకవైపు అభివృద్ధి,మరోవైపు సంక్షేమంతో నిత్యం ప్రజల్లో ఉంటూ కుత్బుల్లాపూర్ ను ఎంతో అభివృద్ధి చేసిన ఫుల్లీ లోడెడ్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌తో కలిసి పనిచేసేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి అయిన నన్ను భారీ మెజార్టీతో గెలిపిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య,అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న సేవలు చిరస్మరణీయం



- మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ తంగా లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మొగల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి బహుజన వీరుడు గౌడ మహారాజ్ శ్రీసర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయమని కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తంగా లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314 వర్ధంతి పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ నగర్‌లోని ఆయన విగ్రహానికి స్థానిక సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు,గౌడ కులస్తులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడిన వాడే పరి పాలనకు అర్హుడని కుల, మత, ప్రాంత వివక్ష లేకుండా స్థానిక, పేద ప్రజల తరఫున పోరాడి గెలిచి 30 సంవత్సరాలు పరిపాలించి, 21 కోటలు కట్టి, ఏడున్నర ఏండ్లు గోల్కొండ చక్రవర్తిగా పరిపాలించిన బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ పతాకం సర్దార్ పాపన్న మహారాజ్ అని కొనియాడారు. జై.గౌడ్ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి బీసు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ బహుజనుల ఆత్మ గౌరవం కోసం ఎంతగా తెగించి పోరాడాడో చివరి దశలో కూడా మొగల్ పాలకులు చుట్టుముట్టినప్పుడు శత్రువుల చేతుల్లో బలిపశువు కావడానికి ఇష్టం లేక, తన చేతిలో ఉన్న బల్లెంతో ఆత్మ బలిదానం చేసుకుని తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ఆకాశమంత ఎత్తున నిలిపిన మహోన్నత శక్తి సర్దార్ సర్వాయి పాపన్న అన్నారు. భరతమాత ముద్దుబిడ్డగా, తెలుగు ప్రజల ఆరాధ్య దైవంగా చరిత్ర గుండెల్లో నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి.సత్యం, భగత్ సింగ్ నగర్ గౌడ సంఘం అధ్యక్షులు బబ్బూరి బిక్షపతి గౌడ్, స్థానిక నాయకులు కె. సాంబయ్య, సామ్రాట్, శ్యామల, బాల్నే రమేష్ గౌడ్, మడ్డి వెంకటేశ్వర్లు గౌడ్, బి.శ్రీధర్ గౌడ్ పాల్గొని ఘన నివాళి అర్పించారు.

భూకబ్జాల కోసమే కాంగ్రెస్ వైపు చూస్తున్న షాడో మేయర్



నవతెలంగాణ-దుండిగల్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని నిజాంపేటలో రూ.2 వేల కోట్లకు పైన ప్రభుత్వ భూములను మాయం చేసిన షాడో, మేయర్ భవిష్యత్తులో మరిన్ని భూకబ్జాల కోసమే కాంగ్రెస్ వైపు ఎత్తుగడలు వేస్తున్నాడని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రనాయక్ ఆరోపించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ శ్రీనివాస్ నగర్ కాలనీ పార్క్‌లో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత గ్రామపంచాయతీ హాయం నుంచి మొదలై 2020లో ఏర్పడిన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చక్రం తిప్పుకొని మేయర్ మహిళ పీఠం దక్కించుకొని, కేవలం ప్రోటోకాల్ వరకే విధులు నిర్వహించారని.. మేయర్ భర్త గత ఐదు సంవత్సరాల కాలంగా షాడో మేయర్‌గా పేరు కాంచారన్నారు. మేడ్చల్ జిల్లా బాచుపల్లి మండలం పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న ప్రభుత్వ భూములు సర్వే నెంబర్ 233/ 15, 16, 191, 334, 186 లలో సుమారు రూ. రెండువేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. కార్పొరేషన్ అధికారులను అడ్డుపెట్టుకొని ప్రతి కన్స్ట్రక్షన్‌కు నేరుగా వెళ్లి వారిపై ఆధిపత్యం చెలయించి షాడో మేయర్‌గా రూ. కోట్లాది రూపాయలు ప్రభుత్వ భూములపై గుత్తాధిపత్యం చెలాయిస్తూ వస్తున్నాడని తెలిపారు. తన అవినీతి దౌర్జన్యంపై పలు పత్రికలలో షాడో మేయర్ వరుస కథనాలు సైతం వచ్చాయని తెలిపారు. తన దారికి అడ్డు వచ్చినా, తనకు సహకరించకపోతే సర్వేనెంబర్ 233/ 15, 16 లో మొన్నటి వరకు ఆ స్థలం కూల్చే వరకు నిద్రపోని మేయర్ భర్త నేడు దగ్గరుండి కబ్జా చేయించడం ప్రభుత్వ జీవో 58, 59 కింద తప్పుడు పత్రాలు సృష్టించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని డీల్ 50-50 చేసుకున్నాడని ఆరోపణలు వెలువెత్తుతున్నాయన్నారు. బడుగు బలహీన మధ్యతరగతి ఇండ్లు లేని నిరుపేద అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తే షాడో మేయర్ భర్త తన బంధువుల పేరిట తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి దాదాపుగా 111 ఇండ్లను తన సొంతం చేసుకున్నాడన్నారు. ఇలాంటి నిరుపేదల ఇండ్లు కాజేయడం నిజంగా సిగ్గుచేటు అని రామచంద్రనాయక్ అన్నారు. నిజాంపేట్‌లోని ప్రభుత్వ భూముల కబ్జాలపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తన భార్య మేయర్ పదవిని అడ్డం పెట్టుకొని ఈ విధంగా ప్రభుత్వ భూములకు కబ్జాలకు దౌర్జన్యాలకు పాల్పడడం నిత్య కృత్యమైపోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. షాడో మేయర్ తన ఆస్తులు కాపాడుకోవడానికి మాత్రమే రాజకీయంలో వచ్చారు తప్ప ప్రజాసేవాల్లో ప్రజలకు సేవ చేద్దామనే కనీసం ఆలోచన లేదని పలువరు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ షాడో మేయర్‌కి ఏ ఒక్క పార్టీలో చోటు కల్పించకూడదని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇటువంటి భూకబ్జాదారులు ప్రజల ఆస్తులు కొట్టే ప్రజల నోళ్లు కొట్టే నాయకులు కాంగ్రెస్ పార్టీలో వస్తే తమ పార్టీకే మచ్చ అని పేర్కొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అయిన తర్వాత ప్రజల తరఫున ఈ సంక్షేమ కార్యక్రమాలు కానీ ప్రజల బాగోగులు చూడలేదని, ఇటువంటి షాడో మేయర్ ఈ పార్టీలో వచ్చినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదన్నారు. ఆయనతో పార్టీ నష్టపోవడం తప్ప పార్టీ నాయకులు కొందరు విడిపోయే ప్రమాదం పొంచి ఉందని రామచంద్రనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, రాజ మల్లేశ్వర్, కృష్ణంరాజు, వర్మ రాజు, మధుసూదన్ రెడ్డి, అనంతయ్య, శ్రీశైలం యాదవ్, ఎస్ శ్రీనివాస్, ఎస్సీ చైర్మెన్ రవికుమార్, మైపాల్, ఫన్నీ పాల్గొన్నారు.





మహేశ్వరం నియోజక వర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ షరీఫ్ నగర్‌లో రియాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారి మనోహర్, నాయకులు అహ్మద్ బామ్, అబ్దుల్ భారీ, రియసత్, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

ఒంటి పూట పని కల్పించాలి : సీఐటీయూ

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్ మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఒంటి పూట పని కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నరసింహ మాట్లాడుతూ ప్రస్తుత ఎండా కాలం దృష్టా ఎండల తీవ్రత క్రమంగా పెరగడంతో కార్మికులకు ఒంటిపూట పని కల్పించాలని కమిషనర్ రవీందర్ రెడ్డిని కోరినట్టు తెలిపారు. తెల్లవారు జామున 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సుమారు 8 గంటల పని చేసుకుని కార్మికులు ఇంటికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెండు పూటల పని విధానం వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా కార్మికుల సమస్యలను గుర్తించి, పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు

ప్రజల సమస్యలే ప్రధాన ఎజెండా



- కమిషనర్ సత్యనారాయణ రెడ్డి

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలే ప్రధాన ఎజెండాగా పనిచేస్తామని కమిషనర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి ఆదేశాలతో రాగన్నగూడ వార్డు కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వార్డుల్లో ఆస్తి పన్ను వ్యాపార లైసెన్స్‌లు 100% వసూలుతోనే మున్సిపల్ అభివృద్ధి సాధ్యమన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో ప్రతినిత్యం సమన్వయం చేసుకోవాలన్నారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని, ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్నీ ఆన్ లైన్ సేవలను వినియోగించుకుంటే సమస్యల పరిష్కారం సులభమవుతుందని అన్నారు. ప్రభుత్వ స్థలాల రక్షణ, పార్కు స్థలాల రక్షణ, హరితహారం కార్యక్రమంలో 100 శాతం చెట్ల రక్షణ అందరీ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మల్లికార్జున్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఈఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

- యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

కొత్తపేట పాత పండ్ల మార్కెట్ పరిధిలో పండ్ల వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి పండ్ల వ్యాపారులతో కలిసి బుధవారం ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ నాగరాజు గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్‌పాత్ పక్కన వ్యాపారం చేసుకుని జీవనం కొనసాగించే చిరు వ్యాపారులను ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి జీవనోపాధి అయిన పండ్ల వ్యాపార్యాన్ని తొలగించడం వలన వారు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పండ్ల వ్యాపారం చేసుకునే విధంగా చొరవ చూపాలని సీఐని కోరారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టి బొమ్మ దహనం



నవతెలంగాణ - ఎల్బీనగర్

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎల్బీనగర్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల దగ్గర తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు.

ఈ సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి సుధాకర్ మాదిగ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన మాదిగలకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకుండా అవమానపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగ, మాదిగ కులాలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నరసింహ, శేఖర్, రాజు, సురేష్, రవి, చిరంజీవి, చిన్న, హుస్సేన్, పుల్లయ్య, ముత్యాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

హయత్ నగర్ సర్కిల్‌కు రెండు అవార్డులు



నవతెలంగాణ- ఎల్బీనగర్

హయత్‌నగర్ సర్కిల్‌కు రెండు అవార్డులు లభించాయి. మొత్తం జీహెచ్ఎంసీలోనే హయత్ నగర్ సర్కిల్ ఆస్తి పన్ను వసూలులో మొదటి స్థానంలో నిలిచింది. ఆస్తి పన్ను వసూలులో నగరంలోనే హయత్ నగర్ రెవెన్యూ సిబ్బంది ప్రథమ స్థానంలో ఉంది. 2023 - 2024 సంవత్సరం ఆస్తిపన్ను వసూలులో ఉత్తమ ప్రతిభను కనబరిచిన బిల్ కలెక్టర్‌లకు బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అవార్డులను అందజేశారు. హయత్ నగర్ సర్కిల్ ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేసి అదనంగా చేసినందుకు ఇద్దరు బిల్ కలెక్టర్‌లకు అవార్డులను అందజేశారు. బిల్ కలెక్టర్ అర్చన, శివరాజు అనే బిల్ కలెక్టర్‌లకు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ బంజారా భవన్ బంజారాహిల్స్‌లో జరిగిన సమావేశంలో అవార్డులను ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ముకుంద్ రెడ్డి హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య సమక్షంలో అవార్డులను అందజేశారు. 2023 - 2024 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీ మొత్తంలో హయత్‌నగర్ సర్కిల్ ఆస్తిపన్ను వసూల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. హయత్ నగర్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బంది ఏఎంసీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్లు ఆస్తి పన్ను వసూళ్లలో ఉత్తమ ప్రతిభను కనబర్చినారు. ఇచ్చిన టార్గెట్ కు మించి ఆస్తి పన్ను వసూలు చేశారు. అదేవిధంగా ఎర్లీ బర్డ్ కింద ఐదు శాతం రాయితీని జీహెచ్ఎంసీ ప్రకటించింది. రాయితీని పొందడంలో కూడా హయత్ నగర్ సర్కిల్ ముందు ఉంది. డిప్యూటీ కమిషనర్‌గా వచ్చిన తిప్పర్తి యాదయ్య ఉత్తమ ప్రతిభను కనబరిచి రెవెన్యూ సిబ్బంది సహకారంతో నగరంలోనే ఆస్తిపన్ను వసూల్‌లో మొదటి స్థానంలో నిలిచింది. డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య ఇచ్చిన టార్గెట్ పూర్తి చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యను ప్రత్యేకంగా అభినందించారు. ఇంటి యజమానులు సకాలంలో తమ ఆస్తి పన్నును చెల్లించి జీహెచ్ఎంసీకి సహకరించినందుకు డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య హయత్ నగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆస్తి పన్ను వసూలులో ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయడంలో సఫలీకృతం చెందిన రెవెన్యూ సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య అభినందించారు.

సమిష్టి కృషితో

ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్ఎంసీ రికార్డు

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమిష్టి కృషితో ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్ఎంసీ కొత్త రికార్డు సృష్టించిందని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. 2023-24 సంవత్సరానికి రికార్డ్ స్థాయిలో ఆస్తి పన్ను వసూలైన నేపథ్యంలో, అందుకు కృషి చేసిన అధికారులు సిబ్బందికి బుధవారం బంజారా హిల్స్‌లోని బంజారా భవన్‌లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ ఆస్తిపన్ను వసూళ్లలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) రికార్డ్ స్థాయిలో అద్భుతమైన వసూళ్లను సాధించిందని అన్నారు. గతంలో కంటే ఎక్కువ, లక్ష్యాన్ని మించి పన్ను వసూలు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్నో అభివృద్ధి పనులను ద్వారా ప్రజలకు మౌలిక వసతులు కల్పన సుస్థిర అభివృద్ధి జరగాలంటే పన్నుల వసూలు సవ్యంగా కావాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను బకాయిలపై వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం అమలుతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు ఆయా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడంతో ఈ ఏడాది దాదాపు రూ.300 కోట్లకు పైగా పన్ను వసూళ్లు జరిగిందని తెలిపారు. వివిధ కేటగిరీ ఉద్యోగులు పూర్తి బాధ్యత, శ్రద్ధతో భాగస్వాములైనారని, జోనల్ స్థాయిలో క్షేత్ర పరిధిలో మైక్రో ప్లానింగ్ అమలు చేయడంతో ఈ ఫలితాలను చూసామని, పన్నుల వసూళ్లలో భాగస్వాములైన ప్రతీ ఒక్కరిని ఈ సందర్భంగా కమిషనర్ అభినందించారు.

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది రూ. 261 కోట్లకు పైగా ఆస్తిపన్ను అదనంగా వసూలైందన్నారు. గత సంవత్సరం 2022-2023లో ఆస్తి పన్ను సేకరణ రూ. 1660.38 కోట్లు కాగా, 2023-2024 సంవత్సరం 1921.58 కోట్ల రూపాయల పన్ను వసూలైందన్నారు. చివరి రోజు మార్చి, 31న 129.35 కోట్ల రూపాయల పన్ను వసూళ్లు నమోదు అయిందని తెలిపారు. ఎర్లీ బర్డ్ అమలుతో గత ఏడాది రూ. 740 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని, ఈ సంవత్సరం రూ. 800 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి అనుకున్న లక్ష్యం సాధించాలని కోరారు. వాస్తవంగా జీహెచ్ఎంసీకి ఆస్తి పన్ను ద్వారా రావాల్సిన ఆదాయం వచ్చేలా ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్దామని అన్నారు. ఈ సందర్భంగా అత్యధికంగా పన్ను వసూల్లు చేసిన బిల్ కలెక్టరుకు, ట్యాక్స్ కలెక్షన్ ఇనిస్పెక్టర్లకు, డిప్యూటీ కమిషనర్లకు ప్రశంసా పత్రాలను కమిషనర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్లు, స్నేహ షబరిష్, శివ కుమార్ నాయుడు, కే శ్రీవాస్తవ, నళిని పద్మావతి, గీత రాధిక జయరాజ్ కెన్నెడీ, యడియాగిరి రావు, సత్యనారాయణ, జోనల్ కమిషనర్లు, రవి కిరణ్, అభిలాష అభినవ్ హేమంత్ బోర్కడే, ముకుంద రెడ్డి, వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి డిప్యూటీ కమిషనర్లు ఏఎంసీ తదితరులు పాల్గొన్నారు.



టెట్ ఫీజును వెంటనే తగ్గించాలి

- జాతీయ బంజారా మిషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్ నాయక్



నవతెలంగాణ - సంతోషనగర్

భారీగా పెంచిన టెట్ ఫీజును వెంటనే తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర జాతీయ బంజారా మిషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ టెట్ ఫీజ్‌ను తగ్గించి, నిరుద్యోగులపై భారాన్ని తగ్గించాలని కోరారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగులు వేల రూపాయలు వెచ్చించి కోచింగ్‌లు తీసుకొని పరీక్ష రాయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నిరుద్యోగులు ఆర్థికంగా, మానసికంగా నష్టపోయారని అన్నారు. వారందరికీ న్యాయం జరగాలంటే టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని డిమాండ్ చేశారు. గతంలో టెట్ దరఖాస్తుకు ఒక పేపర్‌కు రూ.300, రెండు పేపర్లకు రూ.400 ఫీజు ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుత నోటిఫికేషన్‌లో మాత్రం ఫీజును ఏకంగా ఐదు రెట్లు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. టెట్ దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు ఫీజు భారంగా మారిందని పేర్కొన్నారు. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సైతం ఎక్కువ మార్కులు కోసం మరోసారి టెట్ రాయాలనుకునే అభ్యర్థులకు ఫీజు గుదిబండగా మారిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఫీజు పెంచడం సమంజసం కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశ పరీక్షలకు, పోటీ పరీక్షలకు ఫీజులు తగ్గిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పరీక్ష ఫీజుల పెంపును నిరుద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఇప్పటికే నిరుద్యోగులు వివిధ పరీక్షలకు కోచింగ్‌ల కోసం అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ వికలాంగులకు ఫీజులో రాయితీ కల్పించాలని, ఫీజు తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీజేపీలో చేరిన పలువురు



నవతెలంగాణ - హస్తినాపురం

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో శివసేన పార్టీ నాయకుడు బొమ్మిడీ కిరణ్ రెడ్డి, విక్రమ్ యాదవ్, రామకృష్ణ, కిశోర్ చారి, మల్లికార్జున రెడ్డి, రవి కుమార్ వారి మిత్ర బృందంతో కలిసి బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ ఈటల రాజేందర్ కాషాయం కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగా మధుసూదన్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, కల్వకుర్తి ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి తల్లోజు ఆచారి, నాయకులు రవీందర్ రెడ్డి, అవినాష్, రాజవర్ధన్, మహేందర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య



- ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ

నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య అని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. దొడ్డి కొమురయ్య 98వ జయంతి సందర్భంగా ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ యూత్ జనరల్ సెక్రటరీ చిన్నం రమేష్ కురుమ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అరవింద శర్మ ముఖ్య అతిథిగా హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరి నిర్మూలన కోసం పోరాడి తొలి అమరుడు అయ్యారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జగన్ మోహన్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, అల్లాద్దీన్ పటేల్, దుబ్బాక శేఖర్, పాషా, వల్లూరి రమేష్ కురుమ తదితరులు అన్నారు.

‘మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ’ ద్వారా క్యాన్సర్ కణితి తొలగింపు

- రోగి ప్రాణాలు కాపాడిన మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వైద్యులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అతి తక్కువ కోతతో (మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ ద్వారా)ఊపిరితిత్తుల్లో ఉన్న క్యాన్సర్ కణితిని తొలగించి రోగి ప్రాణాలను మెడికవర్ కాన్సర్ ఇనిస్టిట్యూట్ వైద్యులు కాపాడారు. ఖమ్మం జిల్లాకు చెందిన రావు వయస్సు 65 ఏండ్లు. దగ్గు, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతూ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ పవన్‌కుమార్ జొన్నడ, సర్జికల్ అంకాలజిస్ట్‌ని సంప్రదించారు. పరీక్షించిన డాక్టర్ స్కానింగ్ చేసి, ఊపిరితిత్తుల క్యాన్సర్ కణితి ఉన్నట్టు గుర్తించారు. సాధారణంగా ఇలాంటి పేషెంట్స్‌లో చాలా మంది పెద్ద కోతతో ఛాతి కుహరాన్ని తెరిచి ఊపిరితిత్తుల లోబ్, కణితిని తీసేస్తారు. కానీ ఈ పేషెంట్‌లో అతి తక్కువ కోతతో (మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ ద్వారా) ఊపిరి తిత్తుల్లో ఉన్న క్యాన్సర్ కణితిని తొల గించి రోగి ప్రాణాలను కాపాడారు. వయస్సు రీత్యా అతనికి ఇలాంటి సర్జరీ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ ఊపిరితిత్తుల లోబ్ తీసేయడం, క్యాన్సర్ కణితిని తొలగించడం లాంటి సర్జరీ లేవైనా ఇంతకు ముందైతే పెద్ద కోతతో ఛాతి కుహరాన్ని తెరిచి చేసేవాళ్ల అనీ, ఇందుకు ఎటువైపు సమస్య ఉందో అటు పక్క భుజం కింద సగం యూ ఆకారంలో పెద్ద గాటు పెడతారని తెలిపారు. కోత పెద్దగా ఉంటుందనీ, ఈ సర్జరీ వల్ల నొప్పి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రక్తస్రావం కూడా ఎక్కువే అనీ, సర్జరీ తర్వాత పేషెంటు కోలుకోవడానికి కూడా ఎక్కువ సమయం పడుతుంది అని తెలిపారు. ఓపెన్ సర్జరీ చేయించుకున్న తర్వాత వారం నుంచి 10 రోజులు హాస్పిటల్లో ఉండాలనీ, సర్జరీ తర్వాత ఎప్పటిలా కోలుకోవడానికి 3 నెలల సమయం పడుతుందని తెలిపారు. పూర్తి స్థాయి రికవరీ ఉండదనీ, ఈ సర్జరీ ద్వారా థొరాకోటోమీ చేస్తారనీ, అంటే భుజం కింద పెద్ద కోత పెట్టడం. ఇందు కోసం 4 కండరాలను కట్ చేయాల్సి ఉంటుందనీ, అందుకే సర్జరీ తర్వాత ఈ కండరాలు బలహీనం అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. భుజం పనితీరు తగ్గేందుకు ఆస్కారం ఉంటుందనీ, ముఖ్యంగా ఇప్పుడు చేసిన సర్జరీ హాస్పిటల్‌లో 3 రోజులుంటే సరిపోతుందని తెలిపారు. చిన్న కోతతో ఊపిరితిత్తుల లోబ్, కణితిని తొలగించడం దానికి కేవలం రెండు కుట్లు మాత్రమే పడ్డాయనీ, ఒకట్రెండు వారాల్లో కోలుకుంటారని తెలిపారు. ఖర్చు కూడా తక్కువ అవుతుందన్నారు. ఈ సర్జరీ వల్ల ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకటం తగ్గుతుందనీ, ఎక్కువ రోజులు వెంటిలేషన్ అవసరం పడదనీ, రోగి త్వరగా కోలుకుని సాధారణ స్థితికి వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పేషెంట్, అతని కుటుంబ సభ్యులు డాక్టర్ పవన్‌కి ధన్యవాదములు తెలిపారు.



వల్లబ్ నగర్ ఎస్ఆర్వో ఆఫీస్‌లో ఘనంగా దావత్ -ఎ-ఇఫ్తార్

నవతెలంగాణ-సిటీబ్యూరో



టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, ఎస్ఆర్వో వల్లబ్ నగర్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్) ఆధ్వర్యంలో బుధవారం దావత్-ఎ- ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆడిట్ రిజిస్టర్ రవీందర్, పెద్దలు సయ్యద్ జహంగీర్, సయ్యద్ సందాని ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ కార్యక్రమం లో సబ్ రిజిస్టర్ అధికారులు, ఉద్యోగులు, జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఓమర్ ఖాన్, మొహమ్మద్ ముజీబ్, వైదిక్ శాస్త్ర, ఖాలీద్ అహ్మద్, బొల్లిగిద్ద శంకర్, శ్రీధర్ నాయుడు, ఖుతుబుద్దీన్, ముహమ్మద్ అబ్దుల్ వహీద్, ముహమ్మద్ అక్రమ్, అసదుద్దీన్ హుస్సేని, ఉస్మాన్ అలి ఉస్మాని, రామకృష్ణ రెడ్డి, సిమా ముజీబ్, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. గంగా జమున (గంగా జమున తహజీబ్) సంగమంలా కార్యక్రమాలు నిర్వహించడంలో ముజీబ్‌కు మరెవరు సాటి లేరని ముఖ్య అతిథులు కొనియాడారు. నలుగురికి ఆహార వితరణ చేయడం వంటి మంచి కార్యక్రమం చేయడం దేవుడు తనకిచ్చిన వరం అని ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ గుర్తుచేశారు. తన తల్లిదండ్రుల ఆశీర్వాదం.. కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిదన్నారు.

నేరం చేయాలంటేనే వణుకు పుట్టాలి : సీపీ తరుణ్ జోషి

నవతెలంగాణ-హాయత్‌నగర్



నేరం చేయాలంటేనే భయం పుట్టేలా,ప్రజలకు భద్రత కలిగించేలా పోలీసులు ఉండాలని రాచకొండ సీపీ డా. తరుణ్ జోషి అన్నారు. ఎల్బీనగర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లతో క్రైమ్ రివ్యూ మీటింగ్ లో సిబ్బందికి హితవుపలికారు. బుధవారం ఎల్‌బీ నగర్ లో ఉన్న కామినేని హాస్పిటల్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఎల్బీనగర్ జోన్ లోని వివిధ స్టేషన్లలో నమోదైన పోక్సో కేసులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, పెండింగ్ గ్రేవ్ కేసుల విచారణ, ఇతర కేసుల విచారణ పురోగతి మీద సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ఎల్బీనగర్ జోన్ పరిధిలో జరిగే నేరాలను అదుపులో ఉంచాలని, నేర నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వారి బాధలను ఓపికగా విని తగిన న్యాయం చేయాలని సూచించారు. ఎల్బీనగర్ జోన్‌లోని ఆయా స్టేషన్ల సిబ్బంది పనితీరు గురించి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వారి ఫిర్యాదులకు తక్షణమే స్పందించి సత్వర న్యాయం చేకూర్చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎల్బీ నగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎసిపిలు కాశీ రెడ్డి,కృష్ణయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



రేపు ఐపీఎల్‌లో ఎస్ఆర్‌హెచ్, సీఎస్‌కే మ్యాచ్ నేపథ్యంలో హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
గురువారం | ఏప్రిల్ 04, 2024 | www.navatelangana.com

ఉమ్మడి రంగారెడ్డి ఆదాయం రూ. 3067 కోట్లు

- రాష్ట్ర ఆదాయం 6972 కోట్లలో 44శాతం జిల్లా నుంచే
- జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్
- ఉమ్మడి జిల్లా ప్రాంతీయ రవాణాధికారులతో డీటీసీ సమీక్ష

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలకు సంయుక్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.3,143 కోట్లు ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించగా.. రూ.3,067 కోట్లు ఆదాయాన్ని సాధించామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ వెల్లడించారు. గత సంవత్సరం ఆదాయంతో పోలిస్తే 9.9 శాతం వృద్ధి రేటు సాధించామని ఆయన చెప్పారు. ఈ మేరకు బుధవారం మణికొండలోని ఆయన కార్యాలయంలో ఆర్టీవోలు రఘునందన్, సుభాష్ చందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్, శ్రీరామ్‌లతో కలిసి ఆయన సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ లైఫ్‌ట్యాక్స్‌తో సహా అన్ని రకాలుగా రవాణాశాఖకు ఆదాయాన్ని ఆర్జించడంలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉందని వివరించారు. జిల్లాల పరంగా చూస్తే.. రంగారెడ్డి జిల్లా రూ.1,689 కోట్లు అర్జించగా, మేడ్చల్-మల్కాజిగిరి రూ.1298 కోట్లు, వికారాబాద్ రూ.80కోట్లు కలిపి 3,067 కోట్ల రూపాయల ఆదాయం సాధించినట్టు డీటీసీ చెప్పారు. రాష్ట్ర ఆదాయం రూ.6972 కోట్లలో 44శాతం ఆదాయం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాదేనని చంద్రశేఖర్ గౌడ్ వివరించారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో తనిఖీలలో పట్టుబడితే ఆయా వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని వారిని ఆయన హెచ్చరించారు. ఓవర్‌లోడ్‌తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2024-25లోనూ ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని డీటీసీ చంద్ర శేఖర్ గౌడ్ తెలిపారు.

ఉమ్మడి రంగారెడ్డి వార్షిక(2023-24) సంవత్సరం ఆదాయం(రూ.కోట్లల్లో)

జిల్లా	నిర్దేశిత లక్ష్యం	సాధించిన లక్ష్యం	శాతం
రంగారెడ్డి	1718.36	1688.77	98.3
మేడ్చల్	1337.26	1298.31	97.1
వికారాబాద్	87.22	80.12	91.9
మొత్తం	3142.84	3067.2	97.6

ఉమ్మడి రంగారెడ్డి వార్షిక(2023-24) సంవత్సరం ఆదాయం(రూ.కోట్లల్లో)

జిల్లా	2022-23	2023-24	వృద్ధి
రంగారెడ్డి	1523.65	1688.77	10.8
మేడ్చల్	1188.02	1298.31	9.3
వికారాబాద్	78.36	80.12	2.2
మొత్తం	2790.03	3067.2	9.9

మూడు జిల్లాలో (2023-24) వివిధ పన్నుల రూపంలో ఆదాయం..

త్రైమాసిక పన్ను	రూ. 310.64 కోట్లు
జీవితకాలపు పన్ను	రూ.2458.53 కోట్లు
ఫీజులు	రూ.213.62 కోట్లు
సర్వీసు ఫీజు	రూ.42.58కోట్లు
ఎన్‌ఫోర్స్‌మెంట్ (డిటెక్షన్)	రూ.41.83 కోట్లు

ఉగాది నూతన ఆలోచనలకు శ్రీకారం

- సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ



నవతెలంగాణ-కల్చరల్

ప్రతి సంవత్సరం వచ్చే ఉగాది తెలుగువారు నూతన ఆలోచనలకు శ్రీకారం గా భావిస్తారని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై చిమ్మపూడి ఫౌండేషన్, లిటిల్ ముజీషి యన్స్ ఆధ్వర్యంలో రాబోయే క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు జరిగాయి.ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడుతూ ఉగాది ఇంకా వారం రోజులు ఉంది అనగానే వేడుకల వాతావరణం గాన సభ కు వచ్చిందన్నారు. అధ్యక్షత వహించిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ చిమ్మపూడి శ్రీరామ మూర్తి తన ఇంటి పేరిట సంస్థను ఏర్పాటు చేసి సంగీత సాహిత్యల ఉద్దీపన కు వేదిక కల్పిస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా అయోధ్య రామాలయంలో రాముని విగ్రహం కింద యంత్రం రూపొందించిన ప్రవచన కర్త అన్నదానం చిదంబర శాస్త్రిని అధ్యాత్మిక కేసరి బిరుదు తో వందల మంది గాయకులు గా తయారు చేస్తున్న రామా చారిని సుస్వర రామ బిరుదుతోను సత్కరించారు. సాంస్కృతిక సాహిత్య రంగం ప్రముఖులు ఆకృతి సుధాకర్, సాధన నరసింహా చార్య చిక్క రామ దాసు, పోరెడ్డి రంగయ్యలనుసేవా పురస్కారాలతో సత్కరించారు.వేదిక పై దూరదర్శన్ సంచాలకులు కామేశ్వరి, ఆకాశవాణి సంచాలకులు ఉదయ భాస్కర్ భాష్యం యదు మోహన్, కె.జ్ఞాన ప్రసూన తదితరులు పాల్గొనగా సంస్థ నిర్వాహకుడు చిమ్మపూడి శ్రీరామ మూర్తి స్వాగతం పలికారు

ఓయూలో "పంచాయతీరాజ్ సిస్టం"పై పుస్తకం విడుదల



నవతెలంగాణ-ఓయూ

సమగ్ర పుస్తక పఠనంతో పాటు క్షేత్ర పర్యటనతో వచ్చే దత్తాంశ సేకరణ ద్వారానే రీసెర్చ్ బుక్స్ అండ్ రీసెర్చ్ ఆర్టికల్స్ రాయడం సులభం అవుతుందని ప్రముఖ సోషియాలజిస్ట్, మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతా గణేష్ అన్నారు.బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఓయూ సీనియర్ రీసెర్చ్ ఫెల్లో కత్తెరసాల శ్రీనివాస్ రచించిన " ఏ హిస్టరీ ఆఫ్ పంచాయతీ రాజ్ ఇనిస్టిట్యూషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ ఇన్ ఇండియా" పుస్తకాన్ని ప్రొఫెసర్ చింతా గణేష్ తో పాటు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. కుతాడి అర్జున్ రావు, ఓయూ సోషియాలజీ హెడ్ ప్రొ. పి. విష్ణు దేవ్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ బీనవేని షెఫర్డ్, సోషల్ వర్క్ డిపార్ట్ మెంట్ చైర్మన్ డాక్టర్ టి.శ్రీధర్ లు ఆవిష్కరించారు. ప్రొ. చింతా గణేష్ మాట్లాడుతూ. ఈ పుస్తకం అకడమిక్స్ పరంగానే కాకుండా పోటీ పరీక్షలకు సైతం ఉపయుక్తంగా ఉందన్నారు. కొన్ని అంశాలను ఈ పుస్తకంలో చేర్చి రానున్న ఎడిషన్‌లో ప్రచురించాలని రచయితకు సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. కుతాడి అర్జున్ రావు మాట్లాడుతూ. రీసెర్చ్ బుక్స్ రాసి పబ్లిష్ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఓయూ సోషియాలజీ హెడ్ ప్రొ. పి. విష్ణుదేవ్ మాట్లాడుతూ. పంచాయత్ రాజ్ వ్యవస్థ గతం గురించే కాకుండా నేటి నిజాలను కూడా రచయిత తెలియజేశారని పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ బీనవేని షఫర్డ్ మాట్లాడుతూ పరిశోధన వ్యాసాలను విద్యార్థి దశలోనే రాయడం ప్రాక్టీస్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ సోషల్ వర్క్ డిపార్ట్ మెంట్ బీఓఎస్ చైర్మన్ డాక్టర్ శ్రీధర్, నిజాం కళాశాల సోషియాలజీ డిపార్ట్ మెంట్ ఫ్యాకల్టీ మెంబర్స్ డాక్టర్ డి .తిరుపతి, డాక్టర్ సిహెచ్ పరంధాములు, ఓయూ సీనియర్ రీసెర్చ్ ఫెలోస్ వడ్లకొండ దివ్య, దీకొండ శాలిని, నిత్యానంద్, డాక్టర్ ధరావత్ కోట,విద్యార్థి నాయకులు ఉదయ్, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

'బయో క్లబ్ సోడాస్ ప్రపంచంలోని మొట్టమొదటి భారతీయ తయారీ డ్రింక్స్'



నవతెలంగాణ - బంజారాహిల్స్

దేశీయంగా చేసిన బయో బెవరేజెస్ శ్రేణిని బయో ఇండియా సంస్థ అధికారికంగా హైదరాబాద్ మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో బయో బెవరేజెస్ ఆవిష్కర్త డాక్టర్ శ్రీనివాస్ అమర్‌నాథ్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస రాయలు,తెలంగాణ ఫ్రాంచైజీ వి ఎస్ ఎస్,బెవరేజెస్ ఆపరేషన్స్ మేనేజర్ ప్రదీప్,గ్లోబల్ హెడ్ ఆర్ పిళ్లై లు మార్కెట్ లో దీని అవశ్యకతను వివరిస్తూ నాల్గు రంగుల బాటిళ్లను విడుదల చేసి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ... తమ ఉత్పత్తులు సింథటిక్ రుచులు, రంగులు లేని సహజ సుగంధాలతో ఉంటాయని, సాంప్రదాయ ఉత్పత్తులతో పోలిస్తే అదే శాతంలో మత్తు ప్రభావాలను అందిస్తాయన్నారు. రెండు దశాబ్దాల నైపుణ్యం ఆర్ అండ్ డీ నుండి వీటిని కానుకొన్నామన్నారు. బయో బెవరేజెస్ ఫాంచైజీ అయిన (వీఎస్ఎస్),బెవరేజెస్ ద్వారా బయో బెవరేజెస్ ఉత్పత్తులను తెలంగాణలో తయారు చేసి విక్రయిస్తున్నారు. టుడేస్ స్పెషల్ బయో విస్కీ, డైలీస్ స్పెషల్ బయో బ్రాందీ, వైల్డ్ ఫాక్స్ విస్కీ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న బ్రాండ్‌లు. "బయో బెవరేజెస్ ఏ సింథటిక్ రుచులు రంగులను ఉపయోగించకుండా ఉత్తమ బొటానికల్స్, హై క్వాలిటీ స్పిరిట్స్, మాల్ట్ బయో ఆల్కలాయిడ్స్‌తో తయారుచేయబడ్డాయనీ తాను ప్రపంచంలో వినియోగదారుల ఎంపికను దృష్టిలో ఉంచుకుని మొదటిసారిగా బయో లిక్కర్ను అభివృద్ధి చేశామని వివరించారు. వైన్ అండ్ స్పిరిట్స్ హోల్‌సేలర్ ఆఫ్ అమెరికా స్పిరిట్స్ టేస్టింగ్ పోటీల్లో 75 వ వార్షిక కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పోజిషన్‌లో రజతాన్ని,యూఎస్ఏలో బార్టెండర్ స్పిరిట్స్ అండ్ అవార్డ్స్‌లో బయో డిలైట్ రమ్‌కు సిల్వర్,వోడ్కాకు డబుల్ గోల్డ్ లభించిందనీ తెలిపారు.



రేపు ఐపీఎల్‌లో ఎస్ఆర్‌హెచ్, సీఎస్‌కే మ్యాచ్ నేపథ్యంలో హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

బిజినెస్

పరోక్ష పన్ను వసూళ్లలో రికార్డ్



- అంచనాలు మించి రాబడి
- ఏడాదిలో రూ.14.84 లక్షల కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ : దేశంలో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అధిక పన్ను విధానాలు ప్రజల పొదుపును దెబ్బతీస్తుండగా.. సర్కార్ ఖజానా మాత్రం నిండిపోతోంది. ప్రభుత్వ అంచనాలకు మించి రికార్డ్ స్థాయిలో పరోక్ష పన్నులు వసూళ్లు కావడమే ఇందుకు నిదర్శనం. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశంలో 14.84 లక్షల కోట్ల పరోక్ష పన్ను వసూళ్లు జరిగాయని సీబీఐసీ చైర్మెన్ సంజయ్ కుమార్ వెల్లడించారు. ఈ విజయం వృత్తి నైపుణ్యాన్ని ప్రతిబింబించడమే కాకుండా సీబీఐసీ బృందం కృషి, పట్టుదల ఎంతో ఉందన్నారు. సిబ్బంది నిర్విరామ కృషిని గుర్తిస్తున్నామని.. వారికి అభినందనలని అన్నారు.

2023-24లో జీఎస్టీ వసూళ్లు రూ.20.18 లక్షల కోట్లకు చేరి.. నూతన మైలురాయిని నమోదు చేశాయన్నారు. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే 11.7 శాతం వృద్ధి చోటు చేసుకుందని సంజయ్ కుమార్ తెలిపారు. జీఎస్టీ రివైజ్డ్ అంచనాల ప్రకారం.. పరిహారం సెస్ సహా సెంట్రల్ జీఎస్టీ రూ.9.57 లక్షల కోట్లు కాగా, ఎక్సైస్ సుంకం రూ.3.08 లక్షల కోట్లు, కస్టమ్స్ రూ.2.19 లక్షల కోట్లు చొప్పున రాబడి నమోదయ్యిందన్నారు.

ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో సమర్పించిన మధ్యంతర బడ్జెట్‌లో రూ.19.45 లక్షల కోట్ల పరోక్ష పన్ను వసూళ్లు జరగొచ్చని అంచనా వేశారు. ఆ లక్ష్యాన్ని మించి వసూళ్లు జరిగాయి. 2023 ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు ఏకంగా రూ.1.87 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2023-24లో స్థూల పన్ను వసూళ్లు రూ.34.37 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. దేశీయ వినిమయం, ప్రభుత్వ పెట్టుబడుల వ్యయం పెరగడంతో ఆర్థిక వ్యవస్థకు మద్దతు లభిస్తుందని కేంద్ర వర్గాలు పేర్కొన్నాయి.

ఆడి లగ్జరీ కార్ల విక్రయాల్లో 33 శాతం వృద్ధి

ముంబయి : దేశంలో లగ్జరీ కార్లకు డిమాండ్ పెరిగిపోయింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో 33 శాతం వృద్ధితో 7,027 యూనిట్ల లగ్జరీ కార్లను విక్రయించినట్లు ఆడి ఇండియా తెలిపింది. క్రితం ఒక్క మార్చి త్రైమాసికంలోనే ఏకంగా 1,046 యూనిట్ల అమ్మకాలు చేసినట్లు వెల్లడించింది.ఈ ఏడాదిలో భారత్‌లో మొత్తంగా 50,000 లగ్జరీ కార్ల అమ్మకాలు జరగొచ్చని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ దిల్లన్ అంచనా వేశారు.

మార్కెట్లోకి టయోటా అర్బన్ క్రూయిజర్ టేసర్



బెంగళూరు : ప్రీమియం కార్ల తయారీ కంపెనీ టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) బుధవారం భారత మార్కెట్లోకి తన కొత్త అర్బన్ క్రూయిజర్ టేసర్‌ను విడుదల చేసింది. టేసర్ ప్రారంభ ధర రూ.7.73 లక్షలుగా, హైఎండ్ మోడల్ ధరను రూ.13.03 లక్షలుగా నిర్ణయించింది. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో రెండు వేరియంట్లలో దీన్ని అందుబాటులోకి తెచ్చింది. సిఎన్‌జి వర్షన్‌లోనూ లభిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తమకు భారత మార్కెట్ చాలా ముఖ్యమైందని టికెఎం డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ తదాషి అసజుమా పేర్కొన్నారు. బుకింగ్స్ తెరిచామని.. మే నుంచి డెలివరీ చేయనున్నామన్నారు. దిగ్గజ వాహన కంపెనీలు మారుతీ, టయోటా భాగస్వామ్యంలో 6వ మోడల్ కావడం విశేషం.

స్కార్పియస్ ట్రాకర్స్‌కు 1000 మెగావాట్ల ఆర్డర్లు

GENSOL
GENSOL ENGINEERING LIMITED

హైదరాబాద్ : జెన్‌సోల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ స్కార్పియస్ ట్రాకర్స్ ప్రపంచ వ్యాప్తంగా 1000 మెగావాట్ కాంట్రాక్ట్ ఆర్డర్ల మైలురాయికి చేరినట్లు తెలిపింది. తమ సంస్థ భారత్, జపాన్, సౌదీ అరేబియా, ఉగాండా దేశాల్లో కాంట్రాక్టు ఆర్డర్‌లను పొందినట్లు పేర్కొంది. కాంట్రాక్ట్ ఆర్డర్‌ల మైలురాయిని దాటడం మాత్రమే కాదని.. ఇది తమ సామర్థ్యం ప్రదర్శనకు నిదర్శనమని స్కార్పియస్ ట్రాకర్స్ సీఈఓ శైలేష్ వైద్య పేర్కొన్నారు. ఇందులో తమ బృందం కృషి ఘనత ఎంతో ఉందన్నారు.

అమెజ్ ప్రచారకర్తగా కోహ్లీ



లక్నో : లూమినస్ పవర్ టెక్నాలజీకి చెందిన సోలార్ ఉత్పత్తుల బ్రాండ్ అమెజ్ ప్రచారకర్తగా విరాట్ కోహ్లీని నియమించుకుంది.తమ సౌర ఆధారిత ఉత్పత్తులతో సహా ఎనర్జీ సొల్యూషన్స్‌కు విస్తృత ప్రచారం కల్పించ నున్నారని ఆ సంస్థ పేర్కొంది.లవచ్చే మూడేండ్లలో మూడు రెట్ల వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ కంపెనీ సీఈఓ, ఎండీ ప్రీతి బజాజ్ తెలిపారు.

నెలవారి చెల్లింపులతోనూ వైద్య బీమా

- స్టార్ హెల్త్‌తో ఫోన్‌పే జట్టు

న్యూఢిల్లీ : నెలవారి చెల్లింపు ఆప్షన్లతోనూ వైద్య బీమాను పొందవచ్చని ఫోన్‌పే తెలిపింది. ఇందుకోసం తాము స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. యుపిఐ ఆటోపే ద్వారా తమ వినియోగదారులకు నెలవారీ, వార్షిక చెల్లింపు పద్దతిలో రూ.1 కోటి వరకు బీమా అందించడానికి ఈ ఒప్పందం చేసుకున్నామని ఫోన్‌పే ఇన్సూరెన్స్ సిఇఒ విశాల్ గుప్తా తెలిపారు.

లుబ్రిజోల్ ఇండియా సీఎండీగా నితిన్ మెంగిని



న్యూఢిల్లీ : బెర్క్‌షైర్ హాత్‌వేకి చెందిన లూబ్రిజోల్ అడిటివ్స్ ఐఎంఇఎ వైస్ ప్రెసిడెంట్‌గా నితిన్ మెంగిని నియమించినట్టు ఆ సంస్థ తెలిపింది.అదే విధంగా లూబ్రిజోల్ ఇండియా సిఎండిగా కూడా అయన బాధ్యతలను స్వీకరించను న్నారని పేర్కొంది. ఆసియా పసిఫిక్, ఇండియా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికాతో సహా పలు ప్రాంతాల్లో గ్యాస్, ఆయిల్స్ పరిశ్రమలోని బృందాలకు 20 ఏండ్లకు పైగా నేతృత్వం వహించిన అనుభవం ఆయనకు ఉందని ఆ సంస్థ తెలిపింది.

మాతృ భాషలో 'డ్యాన్స్ లైక్ ఎ మ్యాన్' నాటకం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



నాటక రచయిత మహేష్ దత్తాని 'డ్యాన్స్ లైక్ ఎ మ్యాన్' అనే నాటకాన్ని ఒక కళాత్మక కుటుంబం యొక్క సంక్లిష్టమైన ఇంటర్‌జెనరేషన్ డైనమిక్స్ గురించి వ్రాసారు. అది ఆ తరువాత అత్యంత ప్రసిద్ధ రచనలలో ఒకటిగా మారింది. ఈ నాటకాన్ని దర్శకుడు పమేలా రూక్స్ 2004 చలనచిత్రంగా మలిచారు. ఇప్పుడు జీ థియేటర్ వారు తొలిసారిగా ఈ నాటకాన్ని కన్నడ మరియు తెలుగులోకి అనువదించారు. ఈ టెలిప్లేలో నటించిన నటుడు జాయ్ సేన్‌గుప్తా ఈ నాటకం ఇప్పుడు ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరుకుంటుండటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, "దక్షిణాది ప్రేక్షకులు తమ మాతృ భాషలో 'డాన్స్ లైక్ ఎ మ్యాన్' వంటి ప్రసిద్ధ నాటకాన్ని చూడటానికి ఇష్టపడతారు. బెంగళూరు కు చెందిన మహేష్ దత్తాని, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన నాటక రచయితగా ఎదిగారు. ఈ నాటకం బెంగళూరు నేపథ్యంలో రూపుదిద్దుకుంది, సాంస్కృతికంగా మహెూన్నతమైన భరతనాట్య నృత్యకారుల చుట్టూ తిరుగుతుంది. చివరగా, 'డాన్స్ లైక్ ఎ మ్యాన్' గొప్ప థియేటర్ మరియు భాషా అవరోధాలతో సంబంధం లేకుండా ప్రేక్షకులతో కనెక్ట్ అవుతుంది." అని అన్నారు. ఆయనే మాట్లాడుతూ , "ఈ నాటకంలో నేను రెండు భిన్నమైన పాత్రలను పోషిస్తున్నాను. 1950ల నాటి భరతనాట్య నర్తకి మరియు వ్యాపారవేత్త కొడుకు గా నటించటం ఒక పెద్ద సృజనాత్మక సవాలు" అని అన్నారు.

గ్రామీణ బతుకింతే..!

పెరుగుతున్న ఉపాధి డిమాండ్

- తక్కువ వేతనాలు
- ధరలకు అనుగుణంగా పెరగని వేతన రేట్లు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'ఉపాధి' కోసం డిమాండ్ పెరగడం కొనసాగుతున్న గ్రామీణ కష్టాలను స్పష్టం చేస్తుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)లో పని కోసం డిమాండ్‌లో గణనీయమైన పెరుగుదలను నమోదు చేసుకుంది. ఇది కరోనా మహమ్మారి ముందు స్థాయిలను అధిగమించింది. అంతేకాక, గత దశాబ్దంలో గ్రామీణ వేతనాల రేట్లు తక్కువగా ఉన్నాయి. ఆహార ద్రవ్యోల్బణం డిసెంబరులో దాదాపు 10 శాతం వద్ద నమోదైంది. గత కొన్నేండ్లుగా 5 నుంచి 6 శాతం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గ్రామీణ వేతన రేట్లు పెరగలేదు. ఇది బహుశా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ వస్తువుల డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది.

తగ్గిన గ్రామీణ వేతనాలు

పెరుగుతున్న ఆహార ధరలకు అనుగుణంగా గ్రామీణ వేతనాలు పెరగడం లేదు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) డేటా ప్రకారం పురుషుల సగటు గ్రామీణ వేతన రేటు 2008-09 నుండి 2013-14 వరకు రెండంకెలలో ఉండగా, తరువాతి సంవత్సరాల్లో ఇది గణనీయంగా తగ్గింది. 2013-14లో ఇది 27.98 శాతం ఉండగా, 2021-22లో 4.46 శాతానికి, 2022-23లో 5.86 శాతానికి తగ్గింది. సీఎంఐఈ డేటా ప్రకారం, మహిళల పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. 2013-14లో మహిళల వేతన రేటు 25.25 శాతంగా ఉంది. ఇది 2021-22 5.4 శాతం, 2022-23లో 6.24 శాతానికి తగ్గింది.

'ఉపాధి'కి పెరిగిన డిమాండ్

ఉపాధి హామీ చట్టం 2023-24లో 305.2 కోట్ల వ్యక్తిగత రోజులను నమోదు చేసింది. ఇది 2022-23లో 293.7 కోట్లుగా ఉంది. ఇది కొనసాగుతున్న గ్రామీణ కష్టాలను, నగరాల్లో ఉద్యోగ అవకాశాల కొరతను సూచిస్తుంది. దేశం మహమ్మారి నుండి బయటపడిన మొదటి సంవత్సరం 2022-23 కాబట్టి తగ్గుదల అంచనాలు ఉన్నప్పటికీ, 2023-24లో దాదాపు 12 కోట్ల వ్యక్తిగత రోజుల డిమాండ్ పెరగడం గమనించవచ్చు. 2022-23లో వ్యక్తిగత రోజులు 2019-20 కంటే 28.4 కోట్లు ఎక్కువ. 2023-24లో ఇప్పటి వరకు దాదాపు 40 కోట్లు పెరిగాయి. 2020-21 మహమ్మారి బారిన పడిన సంవత్సరంలో పని ఉత్పత్తి 389.9 కోట్ల వ్యక్తిగత రోజుల ఆల్-టైమ్ రికార్డ్‌ను నమోదు చేసుకుంది. ఆపై 2021-22లో 363.2 కోట్లకు పడిపోయింది. ఉపాధి హామీ పనికి అధిక డిమాండ్ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల కొరతను సూచిస్తుంది.

ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉపాధి హామీ కోసం తక్షణ సహాయంగా అదనంగా రూ. 3,400 కోట్లను విడుదల చేసింది. 2023-24 కోసం సవరించిన అంచనా రూ. 86,000 కోట్ల కంటే ఎక్కువ, పని డిమాండ్ అంచనాలను అధిగమించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 89,400 కోట్లు ఉపాధి హామీ కేటాయింపులు చేసింది. అంతకు ముందు సంవత్సరానికి రూ. 90,806 కోట్లు ఉంది.



అక్రమంగా ప్రవేశాలు చేపడితే కఠిన చర్యలు

- ప్రయివేటు, కార్పొరేట్ కాలేజీలు నిబంధనలు పాటించాల్సిందే
- కొనసాగుతున్న అనుబంధ గుర్తింపు ప్రక్రియ : ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాలు అక్రమ పద్ధతుల్లో ప్రవేశాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్‌బోర్డు హెచ్చరించింది.నిబంధనలు పాటించాల్సిందేనని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేపడితే అవి చెల్లుబాటు కాబోవని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేటు జూనియర్ కాలేజీలు పీఆర్వోలను నియమించుకుని అడ్మిషన్లు చేపడుతున్నాయంటూ తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. కొన్ని కాలేజీల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం పరీక్షలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించి ఇంకా ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేయలేదని వివరించారు. ఇప్పుడే కాలేజీల్లో ప్రవేశాలు తీసుకోవద్దని విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు సూచించారు. ప్రవేశాల షెడ్యూల్ వచ్చాక నిర్ణయం తీసుకోవాలని కోరారు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదనీ, ఏ కాలేజీకి గుర్తింపు ఇవ్వలేదని స్పష్టం చేశారు.ఆ జాబితాను tsbie.cgg.gov.in లేదా ఖఝుస్ంఎఅవ.ఎస్గ్గ్ర.గ్రశీఙ.అఅ వెబ్‌సైట్లలో పొందు పరుస్తామని వివరించారు. గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అడ్మిషన్ల షెడ్యూల్ వచ్చాకే విద్యార్థులను చేర్చుకోవాలని ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలను కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఐఈవోలు కఠినంగా వ్యవహరించి అలాంటి కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దళితులకు మత స్వేచ్ఛ ఏది?

- దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితులు తమకు ఇష్టమైన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను కల్పించాలని దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి డిమాండ్ చేసింది. బుధవారం సాధన సమితి ఆధ్వర్యంలో క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనాన్ని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాగళ్ల పోచయ్య మాట్లాడుతూ ఎఫ్ సీలు, బీసీలు, ఎస్టీలు ఏ మతాన్ని అనుసరిస్తున్నా... వారి రిజర్వేషన్లను అనుభవిస్తున్నారని తెలిపారు. ఎస్సీల విషయంలో మాత్రం అందుకు భిన్నంగా క్రైస్తవులైతే ఎస్సీ రిజర్వేషన్లను తొలగిస్తూ వివక్ష చూపించడం తగదని హితవు పలికారు. దళితులకు మత స్వేచ్ఛను కల్పించే వారికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగల్ల కృష్ణ, రాష్ట్ర నాయకులు మారపాక ప్రభాకర్, పల్లె భూమమ్మ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు భాస్కర్, ఉపాధ్యక్షులు జి.ప్రకాశ్, స్వామిదాస్, ఎ.జైపాల్ పాల్గొన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి టీపీడీఎంఏ అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాల సంఘం (టీపీడీఎంఏ) అధ్యక్షులు డాక్టర్ బి సూర్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో ఆయన కలిశారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ప్రయివేటు జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజీల్లో 14 మంది విద్యార్థులు చదువుతున్నారనీ, వారికి చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏడాదికి సుమారు రూ.700 కోట్లవుతుందని వివరించారు.2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 31లోపు పాత విద్యార్థులకు (రెన్యువల్స్), మార్చి 31లోపు కొత్త విద్యార్థుల (ఫ్రెష్)కు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు.వృత్తి విద్యా కాలేజీలు యాజమాన్య కోటా, ఇతర ఫీజులను విద్యార్థుల నుంచి వసూలు చేస్తాయని తెలిపారు. కానీ డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాలకు ఎలాంటి ఫీజులను వసూలు చేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఫీజు బకాయిలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న టోకెన్ల డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

12 మంది రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారం

- నేడు తెలంగాణ, ఏపీ సభ్యుల ప్రమాణం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం ఉదయం ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ కొత్త సభ్యులతో ప్రమాణం చేయించారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్, ఆర్జేడి నేత మనోజ్ కుమార్ ఝా సహా మొత్తం 12 మంది సభ్యులు పెద్దల సభకు ప్రమాణ స్వీకారం చేశారు. ఎల్. మురుగన్, ధర్మశీల గుప్తా, మనోజ్ కుమార్ ఝా, సంజయ్ యాదవ్, గోవింద్‌భాయ్ లాల్జీభాయ్ ధోలాకియా, సుభాష్ చందర్, హర్ష్ మహాజన్, జిసి చంద్రశేఖర్, అశోక్ సింగ్ చంద్రకాంత్, హండోరే మేధా, విశ్రమ్ కులకర్ణి, సాధన సింగ్ తదితరులు ఉన్నారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. నేడు (గురువారం) తెలంగాణ, ఏపీకి చెందిన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.కాగా, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సహా 54 మంది రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే. వీరిలో తొమ్మిది మంది కేంద్ర మంత్రులు కూడా ఉన్నారు. మంగళవారం ఒక్క రోజే 49 మంది రాజ్యసభ ఎంపీలు పదవీ విరమణ చేయగా.. ఐదుగురు ఎంపీలు బుధవారం పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్న ఏడుగురి రాజ్యసభ పదవీ కాలం కూడా మంగళవారంతో ముగిసింది. వీరిలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయా, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా, ఐటి మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి మురళీధరన్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి నారాయణ్ రాణే, సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ ఉన్నారు. పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పదవీ కాలం బుధవారంతో ముగిసింది. ఈ కేంద్ర మంత్రులందరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

వీవీప్యాట్ పై వచ్చేవారం విచారణ

- దాఖలైన పిటిషన్‌కు సుప్రీంకోర్టు అంగీకారం
- మరో పిటిషన్‌పై ఎన్నికల సంఘం, కేంద్రానికి నోటీసులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల్లో వీవీప్యాట్ యంత్రాలలోని మొత్తం స్లిప్పుల కౌంటింగ్ జరిగేలా ఆదేశించాలని సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను వచ్చేవారం విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఏడీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను వచ్చే మంగళవారం లేదంటే బుధవారం రోజున జాబితా చేస్తామని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేషన్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం బుధవారం వెల్లడించింది.పిటిషనర్ ఏడీఆర్ తరఫున సుప్రీంకోర్టుకు హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పిటిషన్‌ను త్వరగా విచారించాలని కోరారు. వీవీప్యాట్లపై దాఖలైన మరో పిటిషన్‌పై స్పందన కోరుతూ ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

ఈ కేసులో సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ కోర్టుకు హాజరై, ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, పిటిషన్‌పై విచారణ జరుగకపోతే పిటిషన్లు నిష్ఫలమవుతాయని తెలిపారు. సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందిస్తూ 'పరిస్థితి తమకు తెలుసు. వచ్చేవారం విచారణ చేపడుతాం' అని పేర్కొంది.

ఏడీఆర్ పిటిషన్‌పై గతేడాది జులై 17న సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్ స్పందన కోరింది. ఓటర్లు వేసిన ఓటును వీవీప్యాట్ మిషన్‌తో నిర్ధారించుకునేలా ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఏడీఆర్ పిటిషన్‌లో కోరింది. వీవీప్యాట్ స్లిప్స్‌ను ఈవీఎం మెషిన్‌తో సరిపోల్చాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుతం ఎంపిక చేసిన ఐదు ఈవీఎంలకు సంబంధించిన వీవీప్యాట్ స్లిప్పులను ధ్రువీకరించే విధానం కొనసాగుతున్నది

ప్రగ్యాఠాకూర్‌కు చీవాట్లు

- మాలెగావ్ కేసులో ముంబయి ప్రత్యేక కోర్టు వారెంట్

ముంబయి : ముంబయి ప్రత్యేక కోర్టు బీజేపీ ఎంపీ ప్రగ్యాఠాకూర్‌ని చీవాట్లు పెట్టింది.2008 మాలెగావ్ కేసులో ప్రధాన నిందితురాలైన ఆమె వరుసగా విచారణకు గైర్హాజరు కావడంతో బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.అనారోగ్యం పేరుతో బుధవారం కూడా ఆమె విచారణకు హాజరుకాలేదు. ఏప్రిల్ 8వ తేదీకల్లా ఆమె ఆరోగ్య పరిస్థితిపై స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాల్సిందిగా నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (ఎన్ఐఏ)ని ఆదేశించింది. అనారోగ్య కారణాలతో బెయిల్ పొందిన ప్రగ్యా ఠాకూర్ .. క్రికెట్, బాస్కెట్ బాల్ ఆడటంతో పాటు డ్యాన్సులు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఆస్పత్రిలో చేరానంటూ గతంలోనూ విచారణను తప్పించుకున్న ఆమె అదే రోజు ఓ కార్యక్రమానికి హాజరవడం గమనార్హం.

టెన్త్ మూల్యాంకన కేంద్రాలకు ఉగాది రోజు సెలవు ఇవ్వండి

- బుర్రా వెంకటేశానికి తపస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉగాది పండుగ రోజు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రాలకు సెలవు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతరావు, నవాత్ సురేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌ను కలిసి 60 ఏండ్లు దాటిన ఉపాధ్యాయులకు పార్లమెంటు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి విధులు కేటాయించొద్దని సూచించారు. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రాల్లో ఎండలు తీవ్ర స్థాయిలో ఉండడంతో వసతులను మెరుగుపర్చాలంటూ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. గతేడాది టీఏ, డీఏల బిల్లులను చెల్లించాలని కోరారు.

అక్రమ ఆస్తుల కేసులో శివబాలకృష్ణ, నవీన్‌కు బెయిల్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

కోట్లాది రూపాయల అక్రమ ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ ప్లానింగ్ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ, ఆయన సోదరుడు శివ నవీన్‌కు బుధవారం ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. హెచ్ఎండీఏలో అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల ఆస్తులను సంపాదించాడని ఆరోపణలపై ఏసీబీ అధికారులు శివబాలకృష్ణతో పాటు అతని సోదరుడు నవీన్‌ను గత జనవరిలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా వీరిపై కేసు నమోదు చేసి 60 రోజులు దాటిన కోర్టులో చార్జ్‌షీట్ వేయని కారణంగా ఈ ఇద్దరికి న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు.

లుక్‌అవుట్ నోటీసు చెల్లదు

- హైకోర్టును ఆశ్రయించిన షకీల్ కుమారుడు సాహిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పోలీసులు జారీ చేసిన లుక్‌అవుట్ నోటీసుల(ఎల్ఓసీ)ను రద్దు చేయాలంటూ బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ వద్ద గత డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలీసులు జారీ చేసిన ఎల్ఓసీని సవాల్ చేశారు. రాత్రి వేళ ఫ్లై ఓవర్ వద్ద ఉన్న బ్యారికేడ్లను ఢీకొట్టిన కేసులో సాహిల్ కోసం పోలీసులు లుక్ఔట్ నోటీసులు జారీ చేశారు. దానిని సవాల్ చేస్తూ సాహిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కావాలని ప్రమాదం చేయలేదనీ, హెచ్చరిక బోర్డులు పెట్టక పోవడంతో చీకటి వల్ల ప్రమాదం జరిగిందని వివరించారు. ఈ కేసులో ఎల్ఓసీ జారీ చేయడం అన్యాయమన్నారు. పంజాగుట్ట పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేయడం చెల్లదన్నారు. తన తండ్రికి వైద్యం నిమిత్తం విదేశం వెళితే పోలీసులు లుక్ఔట్ నోటీసు ఇచ్చారాన్నరు. ఈ వ్యాజ్యం హైకోర్టు విచారణకు రానుంది.

జీడీపీకి బలాన్నిచ్చిన ఆ ఐదు రాష్ట్రాలు

- మహమ్మారి తర్వాత జాతీయ స్థాయిలో రికవరీకి దోహదం
- జాబితాలో మహారాష్ట్ర, యూపీ, తమిళనాడు, రాజస్థాన్, కేరళ : ఎస్బీఐ నివేదిక

న్యూఢిల్లీ : కరోనా తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బ తిన్నది. అయితే, దేశంలోని ఐదు రాష్ట్రాల పనితీరు దేశ జీడీపీకి బలాన్నిచ్చింది. మహమ్మారి అనంతరం దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిలూదింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) నివేదిక ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. ఈ నివేదిక సమాచారం ప్రకారం.. మహారాష్ట్ర, యూపీ నేతృత్వంలోని ఐదు రాష్ట్రాలు.. మహమ్మారి నుంచి జాతీయ జీడీపీకి 235 బేసిస్ పాయింట్లను(బీపీఎస్) జోడించటం ద్వారా అది కోవిడ్‌కు ముందు ఉన్న 5.7 శాతం నుండి 8.1 శాతానికి పెరిగింది. శతాబ్దపు అత్యంత దారుణమైన విపత్తు తర్వాత సగటు అసమానతలు తగ్గుముఖం పట్టాయి. 2021 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మహమ్మారి కారణంగా ఆర్థిక వ్యవస్థ 23 శాతం, ఆ పూర్తి ఆర్థిక సంవత్సరానికి 7 శాతం క్షీణించాయి. 2022-24 ఆర్థిక సంవత్సరానికి గానూ దేశ జీడీపీకి మహారాష్ట్ర అత్యధికంగా 110 బీపీఎస్, యూపీ 60 బీపీఎస్, తమిళనాడు 70 బీపీఎస్, రాజస్థాన్, కేరళలు 20 బీపీఎస్ చొప్పున అందించాయి.